మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 11-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 251 Issue: 251

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:33 సూర్యాస్తమయం - సా. 6:20 తిథి పంచమి రా. 9:14 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం స్వాతి మ. 1:27 వరకు తరువాత విశాఖ యోగం ధ్రువ ఉ. 6:59 వరకు కరణం కౌలవ ఉ. 8:11 వరకు తైతుల రా. 9:14 వరకు వర్జ్యం రా. 7:44 నుండి రా. 9:31 వరకు దుర్ముహూర్తం సా. 4:46 నుండి సా. 5:33 వరకు రాహుకాలం సా. 4:52 నుండి సా. 6:20 వరకు యమగండం మ. 12:27 నుండి మ. 1:55 వరకు గుళికాకాలం మ. 3:23 నుండి సా. 4:52 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:57 నుండి తె. 5:45 వరకు అమృత ఘడియలు ఉ. 6:23 నుండి ఉ. 8:10 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:03 నుండి మ. 12:50 వరకు

Published from Jagitial

Circulated to Telangana


## యూసీసీకి టైమైంది!

### సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: యూనిఫామ్ సివిల్ కోడ్ కు సుప్రీంకోర్టు బహిరంగంగా మద్దతు తెలిపింది. దేశంలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించింది. షరియత్ చట్టంపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా, ఈ అంశాన్ని పార్లమెంటు పరిశీలించాలని సూచించింది. ముస్లిం మహిళలకు ఆస్తి హక్కుల్లో వివక్షపై ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీం.. ఈ సమస్యకు యూసీసీ సరైన పరిష్కారమని పేర్కొంది. షరియత్ చట్టంలోని వారసత్వ నిబంధనలను కొట్టివేస్తే చట్టపరమైన శూన్యత ఏర్పడుతుందని, దానికి బదులుగా చట్టసభలు యూసీసీని తీసుకురావాలని అభిప్రాయపడింది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం అమలు చేసిన యూసీసీ మహిళలకు సమాన వారసత్వ హక్కులను కల్పిస్తున్నదని కోర్టు గుర్తుచేస్తూ.. 'చట్టాల తరువాయి 2 వ పేజీలో...



## కోవిడ్ 'నో ఫాల్ట్ కాంపెన్సేషన్'

### వ్యాక్సిన్ బాధితులకు సుప్రీం ఊరట

న్యూఢిల్లీ: కోవిడ్ వైరస్ వ్యాప్తి అడ్డుకట్టకు భారత్ లో కోవాక్సిన్, కోవిషీల్డ్ వ్యాక్సిన్ ను అందించిన విషయం తెలిసిందే. అయితే ఈ వ్యాక్సిన్ల ప్రభావంతో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధిత కుటుంబాలు కోర్టులను ఆశ్రయించాయి. ఈ నేపథ్యంలో భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. సుప్రీం కోర్టు మార్చి 10, 2026న కోవిడ్-19 వ్యాక్సిన్ (కోవిషీల్డ్, కోవాక్సిన్ వంటివి) తీసుకున్న తర్వాత తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్ వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నవారు లేదా మరణించినవారి కుటుంబాలకు కాంపెన్సేషన్ (పరిహారం) ఇవ్వడానికి 'నో-ఫాల్ట్' పాలసీ రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.



## దిగొచ్చిన చమురు!

### త్వరలోనే యుద్ధం ముగుస్తుందన్న ట్రంప్.. ఒక్క ప్రకటనతో 25 శాతం ధరలు డౌన్

పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం, అమెరికా కూడా దాడులు చేస్తుండటం చమురు మంటల్ని రేపిన సంగతి తెలిసిందే. రిఫైనరీలు సహా హర్మూజ్ జల సంధిపై దాడులతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడగా.. చమురు మార్కెట్లో కల్లోలం సృష్టించింది. ప్రపంచదేశాలు ఈ క్రమంలో ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. పాకిస్థాన్, శ్రీలంక వంటి కొన్ని దేశాలు ఇప్పటికే ఇంధన కొరతతో ధరల్ని పెంచేశాయి.

వాషింగ్టన్: ఇక యుద్ధం ప్రారంభానికి ముందు బ్రెంట్ క్రూడాయిల్ ధర 70 డాలర్ల స్థాయిలో ఉండగా.. ఇది వరుసగా పెరుగుతూ వచ్చింది. మార్చి 9న ఒక దశలో 90 డాలర్ల స్థాయి నుంచి ఇంట్రాడేలో 30 శాతం వరకు పెరిగి 119.5 డాలర్ల వద్ద 4 సంవత్సరాల గరిష్ఠాన్ని తాకిన సంగతి తెలిసిందే. అయితే అక్కడి నుంచి మళ్లీ భారీగా దిగొచ్చింది. కిందటి రోజే చివరకు 15 శాతం వరకు తగ్గి 100 డాలర్ల మార్కు కిందికి చేరగా.. మంగళవారం రోజు మరింత పతనమైంది. కిందటి రోజుతో పోలిస్తే మళ్లీ 6 శాతానికిపైగా పతనంతో ప్రస్తుతం బ్యారెల్ క్రూడాయిల్ ధర 88.65 యూఎస్ డాలర్లుగా ఉంది. మార్చి 9 నాటి గరిష్ఠ స్థాయితో చూస్తే ఏకంగా 25 శాతానికిపైగా మళ్లీ పతనమైందని చెప్పొచ్చు. ఇదే సమయంలో యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ ధర తరువాయి 2 వ పేజీలో...

## హైదరాబాద్‌లో... హోటళ్ల బంద్?


### కమర్షియల్ సిలిండర్ల కొరత.. ఆందోళనలో యాజమాన్యాలు

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు భారత్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి.ముఖ్యంగా మెట్రో నగరాలైన ముంబై, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాలు ఎక్కువగా ప్రభావితం అవుతున్నాయి. గ్యాస్ సరఫరాలో తీవ్ర అంతరాయాలు ఏర్పడటంతో.. దేశీయ అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.





హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): గృహ వినియోగదారులకు అంటే డొమెస్టిక్ సిలిండర్లు, రైతులకు అవసరమైన ఎరువుల తయారీ ఫ్యాక్టరీలు, పవర్ ప్లాంట్‌లకు గ్యాస్ సరఫరాలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. దీంతో కమర్షియల్ సిలిండర్ల సరఫరా తరువాయి 2 వ పేజీలో...



## చమురు సంస్థలపై 'ఎస్మా'

### గ్యాస్ కొరతపై కేంద్రం సంచలన నిర్ణయం

దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రం కావడంతో కేంద్ర ప్రభుత్వం అత్యవసర చర్యలకు ఉపక్రమించింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ప్రపంచ ఇంధన సరఫరాలో ఏర్పడిన అంతరాయాల కారణంగా కమర్షియల్ ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. దీంతో వంట గ్యాస్ క్రమబద్ధమైన సరఫరాను నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం 'నిత్యావసర వస్తువుల చట్టం' (ఎస్మా)ను ప్రయోగించింది.

పశ్చిమాసియాలోని కీలక ఇంధన రవాణా మార్గాల్లో తలెత్తిన ఆటంకాల ఫలితంగా.. బెంగళూరు, ముంబై, చెన్నై వంటి ప్రధాన నగరాల్లోని హాస్పిటాలిటీ రంగం ఇప్పుడు అకస్మాత్తుగా కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల కొరతను ఎదుర్కొంటోంది. సరఫరా పునరుద్ధరించకపోతే కొన్ని రోజుల్లోనే హోటళ్లు మూతపడవచ్చని అసోసియేషన్లు హెచ్చరిస్తున్నాయి.

#### 'ఎస్మా' ఆర్డర్ అంటే..

పెట్రోలియం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. దేశంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆయిల్ రిఫైనరీలపై ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. రిఫైనరీల్లో ఉత్పత్తి అయ్యే ప్రొపేన్, బ్యూటేన్ గ్యాస్ నిల్వలను కేవలం వంట తరువాయి 2 వ పేజీలో...



### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.16,238 |
| వెండి (గ్రాము): | రూ.300 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,592 |

## ముక్కు పిండిన బ్యాంకులు!




### మినిమం బ్యాలెన్స్ లేదని 19,000 కోట్లు వసూలు

### ప్రైవేట్ బ్యాంకులు వసూలు చేసింది 11 వేల కోట్లు

### ప్రభుత్వ బ్యాంకులు వసూలు చేసింది 8 వేల కోట్లు

### పార్లమెంట్‌లో వెల్లడించిన కేంద్ర మంత్రి నిర్మల

బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వలు (మినిమం బ్యాలెన్స్) లేని కారణంగా గడిచిన మూడేళ్లలోప్రైవేటు రంగ బ్యాంకులు ఖాతాదారుల నుంచి రూ.11 వేల కోట్లు వసూలు చేసినట్లు కేంద్రం పార్లమెంటుకు వెల్లడించింది. ఇదే కాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.8 వేల కోట్లు వసూలుచేసినట్లు తెలిపింది.

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రైవేటు రంగ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ అత్యధికంగా రూ.3,800 కోట్లు కనీస నిల్వల నిబంధన పేరుతో ఖాతాదారుల నుంచి వసూలు చేసినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ఆ తర్వాత యాక్సిస్ బ్యాంకు రూ.2,700 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంకు రూ.1,200 కోట్ల చొప్పున వసూలు చేశాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ తరువాయి 2 వ పేజీలో...



## భట్టి లెక్కల బుక్కులు

### ప్రీ బడ్జెట్ సమావేశాలు నిర్వహణ

### గ్రామపంచాయతీలకు శాశ్వత భవనాలు


### టూరిజాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలి

### అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కోర్సులు

### ప్రణాళికలు సిద్ధం చేయాలన్న డిప్యూటీ సీఎం

హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో శాశ్వత భవనాలు లేని గ్రామపంచాయతీలు అన్నిటికి శాశ్వత భవనాలు నిర్మించాలని ఆ మేరకు పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



ఏనుగు తొండంలో ఒక్క ఎముక కూడా ఉండదు. కానీ, దాదాపు 40 వేల కండరాలు ఉంటాయి. మనిషి శరీరంలో ఉండే మొత్తం కండరాల సంఖ్య 600 మాత్రమే. అంటే.. మనిషి కన్నా ఏనుగు తొండం ఎంత ధృడంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.



## 2028 దాకా జల్ జీవన్ మిషన్

### రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలకు 8.8 లక్షల కోట్లు

#### మదురై ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ హంగులు... కేంద్ర కేబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు

ఓవైపు ఇరాన్, ఇజ్రాయెల్- అమెరికా మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలతో పాటు భారత్ కూడా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ కు కొరత రాకుండా పలు నిర్ణయాలు తీసుకుంటుంది. ఇప్పటికే చమురు శుద్ధి సంస్థలపై ప్రభుత్వం నిత్యావసర సరకుల చట్టం- 1955 ను ప్రయోగించింది. అలాగే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతం ఉన్న 21 రోజుల నుండి 25 రోజులకు పెంచింది. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ విక్రయాను అరికట్టేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

న్యూఢిల్లీ: ఇక మరోవైపు ఐదు రాష్ట్రాల ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్ర కేబినెట్ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తాజాగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల -2 వ పేజీలో...



## అసెంబ్లీకి 'బీఆర్ఎస్ మిషన్'

### బడ్జెట్ సమావేశాల కోసం వ్యూహాలు.. పార్టీ ఎమ్మెల్యేలకు ప్రత్యేక శిక్షణ

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్, బీజేపీలు వ్యూహ ప్రతివ్యూహాలతో, సకల అస్త్రశస్త్రాలతో సన్నద్ధమతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల సన్నాహాలు చూస్తుంటే బడ్జెట్ సమావేశాలు వేసవి ఎండల తీవ్రత కంటే కూడా ఎక్కువగానే వాడివేడిగా సాగుబోతున్నాయన్న సంకేతాలను అందిస్తున్నాయి.

హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 16న ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీయడంలో అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాలపై బీఆర్ఎస్ పార్టీ తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఏకంగా తరువాయి 2 వ పేజీలో...



## వెలుగుమట్ల నిరాశ్రయులకు ఇందిరమ్మ ఇళ్లు

ఖమ్మం, మార్చి 10 (ఈవార్తలు): ఖమ్మం జిల్లా వెలుగుమట్ల నిరాశ్రయులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పేదలకు ఇంటిపట్టా, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా సర్వే తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

11.3.2026

మేషం: నూతన వ్యాపారాలను ప్రారంభించి లాభాలను అందుకుంటారు. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. అన్ని వైపుల నుండి ఆదాయ మార్గాలు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో శుభవార్తలు అందుతాయి. జీవిత భాగస్వామితో గృహమున సంతోషంగా గడుపుతారు.

వృషభం: ఉద్యోగస్తులు అనుకూల మార్పులు చోటు చేసుకుంటాయి. ముఖ్యమైన వ్యవహారాలు అనుకున్న సమయానికి పూర్తవుతాయి. కుటుంబ వ్యవహారాలలో చిన్నపాటి సమస్యలు ఉన్న అధిగమిస్తారు. నూతన ఋణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు పుంజుకుంటాయి.

మిథునం: నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. సంతాన వివాహ ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చాలా కాలంగా వేధిస్తున్న సమస్యలు తొలగుతాయి. ఆకస్మిక ధన లాభం కలుగుతుంది. ఉద్యోగస్తులకు బాధ్యతలలో ఆటంకాలు అధిగమించి ముందుకు సాగుతారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

కర్కాటకం: మొండి బాకీలు వసూలవుతాయి. వ్యాపార వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందుతారు. ఉద్యోగస్తులకు ఉన్నత పదవులు పొందుతారు. గృహమున నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

సింహం: వృత్తి వ్యాపారాలలో భాగస్వాములతో సఖ్యత కలుగుతుంది. నూతనోత్సాహంతో కొన్ని కార్యక్రమాలు ప్రారంభించి సకాలంలో పూర్తిచేస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి.

కన్య: ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తీరి ఊరట చెందుతారు. చేపట్టిన వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. వ్యాపారాల విస్తరణకు నూతన పెట్టుబడులు అందుతాయి. సమాజంలో మీమాటకు విలువ పెరుగుతుంది. భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఖర్చుల విషయంలో పునరాలోచన చెయ్యాలి.

తుల: పాత విషయాలు జ్ఞప్తికి తెచ్చుకుంటారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరి మానసిక ప్రశాంతత పొందుతారు. నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు. ప్రత్యర్థులు కూడా మిత్రులుగా మారి సహాయ సహకారాలు అందిస్తారు. వ్యాపార ఉద్యోగాలలో ఆశించిన మార్పులుంటాయి.

వృశ్చికం: ఇంటా బయట గౌరవ మర్యాదలు పెరుగుతాయి. కుటుంబంలో కొందరు ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆలోచనలు ఆచరణలో పెడతారు. వృత్తి వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది. ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ ఆదాయం విషయంలో లోటు ఉండదు.

ధనస్సు: ముఖ్యమైన కార్యక్రమాలు ప్రారంభించిన సకాలంలో పూర్తి చేస్తారు. పాత మిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ఖర్చుకు తగిన ఆదాయం ఉంటుంది. స్థిరాస్తి వివాదాలు రాజీ చేసుకుంటారు. వ్యాపారాలకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. నిరుద్యోగులకు కలలు నిజమవుతాయి.

మకరం: వాహన కొనుగోలుకు అవరోధాలు తొలగుతాయి. ఇతరులకు వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. ఆత్మీయుల సహాయ సహకారాలతో ఋణ సమస్యలు నుండి బయటపడతారు. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతల నుండి ఉపశమనం పొందుతారు.

కుంభం: వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. అవసరాలకి ఆదాయం సరిపడక నూతన రుణాలు చేయాల్సి వస్తుంది. కుటుంబ వ్యవహారాలలో స్థిరమైన ఆలోచనలు చెయ్యక కొత్త సమస్యలు చోటుచేసుకుంటాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు భాద్యతలు ఉంటాయి. చిన్నతరహా పరిశ్రమలకు ఒడిదుడుకులు తప్పవు.

మీనం: నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి. అవసరానికి ధన సహాయం లభిస్తుంది. ఇంటా బయట ఆదరణ పెరుగుతుంది. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారాలలో నూతన ప్రణాళికలు అమలు చేసి లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తులు ఉన్నత పదవులు పొందుతారు.

# భట్టి లెక్కల బుక్కులు

మొదటి పేజీ తరువాయి

రెడ్డి, గడ్డం వివేక్ లతో కలిసి ఆయా శాఖల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ స్థలాలు అందుబాటులో ఉన్నచోట తాసిల్దార్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యం పై దృష్టి పెట్టాలని సూచించారు. చిన్నారుల మెదడు బలంగా ఎదిగేందుకు అవసరమైన పౌష్టిక ఆహారంతో పాటు బోధనా పద్ధతుల తో వారికి తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. పట్టణాల్లో రహదారుల పైన కొంతమంది చంటి బిడ్డలను పెట్టుకొని యాచక వృత్తి కొనసాగిస్తున్నారు వారందరినీ శిశు విహార్ లో తీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్లపై చంటి బిడ్డలు పట్టపగలు ఎండకు, వర్షాకాలంలో వానకు తడిసి వారి విలువైన బాల్యం మసకబారి పోతుందని ఆ విధంగా జరగడానికి అవకాశం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం తెలిపారు. శిశు విహార్ లో మోడ్రన్ కిచెన్ నిర్మించాలని సూచించారు. ఉపాధి కల్పించే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు రూపొందించాలని, గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ఎంఓయూ కుదుర్చుకున్న కంపెనీలను సంప్రదించి అందుకు అనుగుణంగా ఏటీసీ సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు.



క్యూర్, ప్యూర్ రేర్ పాలసీకి అనుగుణంగా వచ్చే పరిశ్రమలను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టాలి, స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేసుకోవాలని సమంత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారా మాత్రమే జరగాలని ఈ క్రమంలో ఏజెన్సీలకు ఐటీడీఏ ల నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని వారిని ఆర్థికంగా బలోపేతం చేసి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులకు సూచించారు. కవ్వాల్, శ్రీశైలం వంటి టైగర్ జోన్లు అభివృద్ధి చేసుకోవాలని పర్యాటకులను ఆకర్షించే విధంగా ఎకో, టెంపుల్ టూరిజం ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు యువతను చైతన్యం చేయాలని, డ్రగ్స్ వినియోగం ద్వారా జరిగే నష్టాన్ని కళ్లకు కట్టినట్టు చూపించే విధంగా గ్రామస్థాయిలో కళారూపాలు ప్రదర్శించేలా సాంస్కృతిక శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా కళాకారులకు జీవనోపాధి కలగడంతో పాటు సమాజంలో మంచి మార్పు కనిపిస్తుందని అన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సీసీఎల్ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అనిత రామచంద్రన్, దివ్య దేవరాజ్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, గృహ నిర్మాణ శాఖ సెక్రటరీ గౌతం, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# దిగొచ్చిన చమురు!

మొదటి పేజీ తరువాయి

కూడా 6 శాతానికిపైగా తగ్గి 88.65 డాలర్ల వద్ద ఉంది. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో క్రూడాయిల్ ధర ఒక్కసారిగా దిగొచ్చినట్లు తెలుస్తోంది. సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డొనాల్డ్ ట్రంప్.. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం అతి త్వరలోనే ముగిసిపోనుందని వ్యాఖ్యానించారు. ముందుగా 4-5 వారాలు పట్టొచ్చని అంచనా వేసినప్పటికీ.. ఇప్పుడు ఇలా ప్రకటన చేయడంతో కాస్త ఉద్రిక్తతలు తగ్గినట్లు తెలుస్తోంది. తాజాగా, ఇంధన ధరల్ని నియంత్రించే విషయమై ట్రంప్ మరికొన్ని కీలక చర్యలు తీసుకున్నారు. కొన్ని రకాల చమురు ఆంక్షల్ని తొలగిస్తున్నట్లు తెలిపారు. చమురు ధరలు పెరగకుండా నిరంతర సరఫరా కొనసాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రష్యా, భారత్ సహా పలు దేశాలపై ముడి చమురు క్రయవిక్రయాలపై



ట్రంప్ కొద్ది రోజుల కిందట ఆంక్షలు విధించగా.. వాటిని ఇప్పుడు తాత్కాలికంగా తొలగించారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు ఆంక్షల్ని పక్కన బెడుతున్నట్లు వివరించారు. సముద్రంలో ఉన్న రష్యా చమురును కొనుగోలు చేసేందుకు.. భారత్‌కు కూడా 30 రోజుల వరకు మినహాయింపు ఇస్తున్నట్లు ఇటీవల అమెరికా ప్రకటించింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లకు కాస్త ఊరట లభించింది. వీటికి తోడు మరికొన్ని అంశాలు కూడా చమురు ధరలు తగ్గేందుకు కారణంగా నిలుస్తున్నాయి. ఇరాన్ యుద్ధంపై ట్రంప్.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్‌లో చర్చలు జరిపినట్లు రష్యా ప్రెసిడెన్షియల్ ఆఫీస్ క్రెమ్లిన్ తెలిపింది. యుద్ధం ముగింపునకు సంబంధించి పుతిన్ కొన్ని దౌత్య చర్యలపై ప్రతిపాదనలను ట్రంప్‌కు చెప్పినట్లు సమాచారం.

# హోటళ్ల బంద్?

మొదటి పేజీ తరువాయి

గణనీయంగా తగ్గింది. హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వహణ భారంగా మారింది. కమర్షియల్ సిలిండర్ల కొరత కారణంగా హోటళ్లలో పొయ్యి వెలగని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే చెన్నై హోటల్స్ అసోసియేషన్ ఈ సంక్షోభంపై కేంద్రానికి మొరపెట్టుకుంది. బెంగళూరులో హోటల్స్ యాజమాన్యాలు హోటళ్లు, రెస్టారెంట్లు మూసేసి సమ్మెకు దిగి నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ముంబైలోనూ 20 శాతం మేర హోటళ్లు మూతపడ్డాయి. తాజాగా.. ఈ గ్యాస్ కొరత వేడి తెలంగాణకు కూడా తాకింది. రాష్ట్రంలో కమర్షియల్ సిలిండర్ల కొరతపై ఆందోళన వ్యక్తం చేస్తూ తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అత్యవసరంగా సమావేశమైంది. కేవలం హైదరాబాద్ నగరంలోనే సుమారు 6 వేల హోటళ్లపై ఈ ప్రభావం పడుతుండటంతో హోటళ్ల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గిరాకీ ఉండే రంజాన్ మాసంలో గ్యాస్ సరఫరా లేకుంటే నిర్వహణ కష్టమని నిర్వాహకులు భావిస్తున్నారు. బెంగళూరు తరహాలోనే తెలంగాణలో కూడా హోటళ్లు, రెస్టారెంట్లు మూసివేసి సమ్మెకు వెళ్లాలా? లేక ప్రభుత్వంతో చర్చలు జరపాలా? అనే అంశంపై తీవ్రంగా సమాలోచనలు



చేస్తున్నాయి. గ్యాస్ సంక్షోభం త్వరగా సమసిపోకుంటే రాష్ట్రంలో పర్యాటక, సేవా రంగం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని అంటున్నారు.

# ముక్కు పిండిన బ్యాంకులు!

మొదటి పేజీ తరువాయి

బ్యాంకు అత్యధికంగా రూ.1,500 కోట్లు వసూలు చేయగా, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.1,200 కోట్లు, ఇండియన్ బ్యాంకు రూ.1,100 కోట్ల చొప్పున వసూలు చేసినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. కాగా, కనీస నిల్వలపై ఎస్బీఐ 2020 మార్చి నుంచి ఛార్జీలు వసూలు చేయడం లేదు. గత ఏడాది నుంచి పంజాబ్ నేషనల్ బ్యాంకు, కెనరా బ్యాంకు కూడా ఈ చార్జీలను తొలగించాయి.

# ఇరాన్ పనైపోయింది

మొదటి పేజీ తరువాయి

అదో ఓడిపోయిన దేశం' అంటూ ఎద్దేవా చేశారు. దాడులపై పొరుగు దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ క్షమాపణలు చెప్పడంపై ట్రంప్ స్పందిస్తూ.. టెహ్రాన్ ఇక పోరాటం చేయలేక చేతులెత్తేసిందని, ఆ దేశం తోకముడిచిందని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "నరకయాతన అనుభవిస్తున్న ఇరాన్.. క్షమాపణలు చెప్పి, పశ్చిమాసియాలోని పొరుగు దేశాలకు లొంగిపోయింది.. ఇకపై వారిపై కాల్పులు జరపనని హామీ ఇచ్చింది. ఈ ప్రకటనకు అమెరికా- ఇజ్రాయెల్ నిరంతర దాడులే కారణం" అని అన్నారు. "పశ్చిమాసియాను ఇరాన్ ఇక బెదిరించలేదు.. అదో ఓడిపోయిన దేశం.. లొంగిపోయే వరకు ఇంకా చెప్పాలంటే పూర్తిగా కూలిపోయే వరకు దశాబ్దాల పాటు అదే పరిస్థితిలో ఉంటారు"అని డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను అవమానించేలా తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు.

# చమురు సంస్థలపై 'ఎస్మా'

మొదటి పేజీ తరువాయి

గ్యాస్ తయారీకే వాడాలని, పెట్రోకెమికల్స్ తయారీకి మళ్లించకూడదని ప్రభుత్వం ఆదేశించింది. ఉత్పత్తి అయిన మొత్తం గ్యాస్‌ను కేవలం ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్ పీసీఎల్ లకు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే ఎస్మా చట్టం కింద క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. గృహ అవసరాలకు ప్రాధాన్యమిస్తూ కమర్షియల్ గ్యాస్ సరఫరాపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీనివల్ల బెంగళూరు, చెన్నై, ముంబై వంటి నగరాల్లో కమర్షియల్ సిలిండర్ల సరఫరా నిలిచిపోవడంతో వందలాది హోటళ్లు మూతపడే స్థితికి చేరుకున్నాయి. దీంతో హోటళ్లను కూడా అత్యవసర సేవలుగా గుర్తించి గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని హోటళ్ల అసోసియేషన్ వారు కోరుతున్నారు. దీనికి తోడు మార్చి 7 నుంచి గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.60, కమర్షియల్ సిలిండర్ ధర రూ.115 పెరగడం గమనార్హం.

## వెలుగుమట్ల నిరాశ్రయులకు

# ఇందిరమ్మ ఇళ్లు

మొదటి పేజీ తరువాయి

నిర్వహించారు. భూదాన్ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారిలో అర్హులు ఎవరన్న దానిపై ప్రత్యేకంగా సర్వే చేశారు. మొత్తం 766 మంది బాధితులుండగా.. వీరిలో 412 మందిని అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. వీరిలో 311 మందికి ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు, మరో 101 మందికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులను పిలిచి రెవెన్యూ అధికారులు టోకెన్లు పంపిణీ చేస్తున్నారు. బుధవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి పట్టాలు పంపిణీ చేయనున్నారు.

# 2028 దాకా జల్ జీవన్ మిషన్

మొదటి పేజీ తరువాయి

కల్పనకు దాదాపు రూ.8.80 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు. 'జల్ జీవన్ మిషన్ 2.0'ను 2028 డిసెంబర్ వరకు పొడిగించారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 8.7 లక్షల కోట్లను కేటాయించింది. ఈ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఇప్పటికే 81 శాతం గ్రామీణ గృహాలకు కుళాయి కనెక్షన్లు అందాయి. రెండో దశలో భాగంగా మిగిలిన ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం.. అలాగే మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారించనున్నారు. అలాగే తమిళనాడులోని మదురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ఎయిర్ పోర్టుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరం పుణ్యక్షేత్రాలకు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని కేంద్రం భావించింది. దాంతోపాటు రైల్వేలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రూ. 4,474 కోట్ల వ్యయంతో రెండు ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇక మధ్యప్రదేశ్ లో కొత్తగా 4 లేన్ కారిడార్ నిర్మాణానికి సైతం కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇవే కాకుండా ఎన్నికల నేపథ్యంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పీఎం ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

# యూసీసీకి టైమైంది!

మొదటి పేజీ తరువాయి

వల్ల సంక్లిష్టతలు తలెత్తితే వాటిని నివారించడానికి శాసనసభ కృషి చేయాలి' అని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

# అసెంబ్లీకి 'బీఆర్ఎస్ మిషన్'

గండిపేటలోని గోల్కొండ రిసార్ట్‌లో వర్క్ షాపు నిర్వహించి శిక్షణ ఇచ్చింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్లు సబితా ఇంద్రారెడ్డి ,తలసాని శ్రీనివాస్ యాదవ్, అసెంబ్లీ విప్ వివేకానంద ప్రభృతులు అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. సభలో లేవనెత్తాల్సిన ప్రజా సమస్యలు, నియమనిబంధనలు (రూల్ బుక్), రాజ్యాంగ అంశాలపై అవగాహన కల్పించారు. కౌన్సిల్ వైస్ చైర్మన్ బండ ప్రకాష్, శాసన మండలి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తోపాటు పలువురు సీనియర్ నేతలు ప్రసంగించారు. ముగింపు సెషన్ లో కేటీఆర్ అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మార్గదర్శకం చేశారు. బడ్జెట్ సమావేశాలకు అధికార, ప్రతిపక్ష పార్టీల కసరత్తులు చూస్తే ఈ ధఫా సమావేశాలు వాడీవేడిగా సాగడం ఖాయమంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యులు సభలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలపైన, రైతు భరోసా పెండింగ్ పైన, కాళేశ్వరం మరమ్మతులు, మూసీ నది సుందరీకరణ, హిల్ట్ పాలసీ, భూ భారతి, కొత్త అప్పులు, యూరియా యాప్, వెలుగుమట్ల భూదాన్ భూముల ఇళ్లకూల్చివేత వంటి అంశాలతో దాడి చేయనుందని తెలుస్తోంది.







# పసుపు సాగుపై అవగాహన

**పురుగుల మందులు వాడొద్దు.. శాస్త్రీయ పద్ధతిలో సాగు చేయండి**

**రైతులకు పసుపు బోర్డు సూచన**

**నిర్మల్‌లో అవగాహన సదస్సు.. పాల్గొన్న బోర్డు సెక్రటరీ భవానీ శ్రీ**

నిర్మల్, మార్చి 10 (ఈవార్తలు): పసుపు పంట సాగులో పురుగుల మందుల వాడకాన్ని తగ్గించి, శాస్త్రీయ పద్ధతిలో సాగు చేపట్టాలని రైతులకు జాతీయ పసుపు బోర్డు సెక్రటరీ భవానీ శ్రీ సూచించారు. మంగళవారం తెలంగాణలోని నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. పురుగుల మందుల అవశేషాలు ఉండటం వల్ల ప్రపంచ మార్కెట్‌లో ఇబ్బందులు వస్తాయని తెలిపారు. ఈయూ, అమెరికా, బ్రిటన్, జపాన్ తదితర దేశాలు పురుగుల మందుల అవశేషాలు, ఇతర కలుషితాలపై నిబంధనలు కఠినతరం చేశారని వెల్లడించారు. రైతులంతా శాస్త్రీయ పద్ధతిలో సాగు చేయడం వల్ల, పంట దిగుబడి బాగుంటుందని, అంతర్జాతీయ మార్కెట్‌లో మన పసుపు డిమాండ్ లభిస్తుందని వివరించారు. పొలంలోనే రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అదీకాక, పంట నిర్వహణ, తేమ నియంత్రణ, ఎండబెట్టడం వంటి చర్యలు పంట నాణ్యతను ప్రభావితం చేస్తాయని అన్నారు. ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం) వంటి చర్యల ద్వారా ఆర్గానిక్ సాగుకు మారడం సులువవుతుందని చెప్పారు. ఈ పద్ధతిలో 200 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల్ జిల్లా సహకార సంఘం చైర్మన్ బొమ్మారెడ్డి బోర్డు చర్యలను శ్లాఘించారు. రైతులకు ఎంతో విలువైన సూచనలు ఇచ్చారని ప్రశంసించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పురుగు నియంత్రణ, సాగు పద్ధతులు, ఎగుమతి ప్రమాణాలపై ప్రశ్నలు వేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 100 మందికి పైగా రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, జాతీయ పసుపు బోర్డు అధికారులు, సంఘకార సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.



## వేటేస్తారా? వెనకేసుకొస్తారా?

**ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం నేడే!**

హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): ఫిరాయింపు ఎమ్మెల్యేలపై గత కొంతకాలంగా సాగుతున్న ఉత్కంఠకు బుధవారంతో తెరపడనుంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై శాసనసభ స్పీకర్ తన తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, నిర్ణీత గడువు ముగుస్తుండటంతో స్పీకర్ కార్యాలయం ఈ మేరకు సిద్ధమైంది. మొత్తం పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించగా, ఇప్పటికే ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు. దానం, కడియంలపై తాజాగా వాదనలు పూర్తయ్యాయి. సుప్రీంకోర్టు సూచనల ప్రకారం మార్చి 12వ తేదీలోపు వీరిద్దరి విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని ప్రకటించాలి. దీంతో బుధవారం స్పీకర్ తీర్పు ఎలా ఉండబోతుందో అని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఆ తీర్పు దానం, కడియం రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనుంది. అనర్హత వేటు పడితే ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉంటుంది. అంతేకాదు.. ఈ నిర్ణయం రాష్ట్రంలోని ఇతర పార్టీ ఫిరాయింపుదారులపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉండటంతో అందరి దృష్టి స్పీకర్ తీర్పుపైనే ఉంది.

# డాక్టర్ నమ్రత ఆస్తులు జప్తు

హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ రిసెర్చ్ సెంటర్ పేరుతో అక్రమాలకు పాల్పడిన డాక్టర్ పాచిపల్లి నమ్రత అలియాస్ అథ్లూరి నమ్రతకు సంబంధించిన ఆస్తులను హైదరాబాద్ ఈడీ జోనల్ కార్యాలయ అధికారులు జప్తుచేసినట్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. అక్రమ సరోగసీ రాకెట్ దర్యాప్తులో భాగంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల ప్రకారం రూ. 29.76 కోట్ల విలువైన 50 స్థిరాస్తులను తాత్కాలికంగా జప్తు చేసింది. సీజ్ చేయబడిన ఆస్తులు డాక్టర్ నమ్రత, ఆమె కుమారుల పేరు మీద ఉన్నట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు. భూమలు, ఫ్లాట్‌లు ఆసుపత్రి రూపంలో ఆస్తులు గుర్తించినట్లు తెలిపారు. ఈడీ సీజ్ చేసిన ఆస్తుల విలువ ప్రస్తుత మార్కెట్ ప్రకారం దాదాపు రూ. 50 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ లో అక్రమ అక్రమ సరోగసీ, పిల్లల అక్రమ రవాణా, ఇతర మోసాలకు సంబంధించి నమోదు అయిన పలు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రిసెర్చ్ సెంటర్ ద్వారా డాక్టర్ నమ్రత తన ఉద్యోగులు ఏజెంట్లతో కలిసి సరోగసీ రాకెట్ నిర్వహించి పిల్లలు లేని జంటలకు నవజాత శిశువులను విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పేర్కొన్నారు. పిల్లలు లేని జంటలకు సరోగసి విధానం ద్వారా పిల్లను పొందవచ్చని వారి నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలినట్లు పేర్కొన్నారు. నవజాత శిశువును పెంచే ఆర్థిక స్థితి లేని పేదవారి నుంచి , గర్భస్రావం చేయాలనుకున్న వారి నుంచి శిశువులను సేకరిచించిన్నట్లు గుర్తించారు. శిశువులను విక్రయించిన వారికి ఆడ శిశువుకు దాదాపు రూ. 3.5 లక్షలు, మగ శిశువుకు రూ. 4.5 లక్షలు చెల్లించేవారని




దర్యాప్తులో తేలింది. ఏజెంట్లు, సబ్-ఏజెంట్ల నెట్‌వర్క్ ఈ రాకెట్‌లో నడుపబడినట్లు గుర్తించారు. సికింద్రాబాద్ ఆసుపత్రి లైసెన్స్‌ను అధికారులు రద్దు చేయడంతో విశాఖపట్నంలోని మరో ఆసుపత్రిలో అలాంటి ప్రసవాలు జరిగినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. మున్సిపల్ అధికారులకు పంపిన జనన నివేదికలను ఆమె నకిలీ చేసి, పిల్లలు లేని జంటల పేర్లను వారి తల్లిదండ్రులకు బదులుగా తల్లిదండ్రులుగా చూపించినట్లు గుర్తించారు. 2014 నుంచి ఆమె ఈ రాకెట్‌లో నిర్వహిస్తుందని, అనేక కేసులు నమోదు తర్వాత ఆమె వైద్య లైసెన్స్‌ను అధికారులు సస్పెండ్ చేసిన తర్వాత కూడా ఆమె నకిలీ సరోగసీ రాకెట్‌ను కొనసాగించిందని ఈడీ దర్యాప్తులో తేలింది. నమ్రతను ఫిబ్రవరి 12వ తేదిన అరెస్ట్ చేసినట్లు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు.



## నన్ను ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారు

**వెలుగుమట్ల బాధితుల పక్షాన నిలబడ్డా**

**అర్ధరాత్రి అరెస్ట్ చేసి**

**హైదరాబాద్‌కు తరలిస్తారా?**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్**

ఖమ్మం, మార్చి 10 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారు. నిరాహార దీక్షకు దిగిన తనను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పేదల కోసం గళమెత్తిన తనను ఒక ఉగ్రవాదిలా భావించి అరెస్ట్ చేశారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కవిత, వెలుగుమట్లలో పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను అధికారులు కర్కశంగా కూల్చివేసిన తీరును తప్పుబట్టారు. భూదాన్ భూములు అంటేనే పేదలకు ఇచ్చేవి అని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. కూల్చివేసిన చోటే మళ్లీ ఇళ్లను నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ, ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న తీరును గమనించాలని కవిత సూచించారు. ఈ అన్యాయంపై ఆయనకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. బాధితుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఉన్నారని, పరీక్షల సమయంలో వారిని రోడ్డున పడేయడం కలెక్టర్, జిల్లా మంత్రులకు కనిపించడం లేదా? అని ఆమె నిలదీశారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని, అవసరమైతే కోర్టులో పిల్ వేసి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# కటకటాల్లోకి 208 మంది టెకీ దొంగలు

**తెలంగాణలో ఆపరేషన్ క్రాక్‌డౌన్ సక్సెస్**

**నిందితుల్లో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు, టెకీలు, విద్యార్థులు**

**రూ.100 కోట్ల మోసాలకు మ్యూల్ ఖాతాలు వాడినట్లు గుర్తింపు**




హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): రాష్ట్రంలో మోసగాళ్లకు సహకరిస్తున్న వారిపై రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఉక్కుపాదం మోపింది. 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' పేరుతో ఫిబ్రవరి 25న ప్రారంభించిన ఈ రాష్ట్రవ్యాప్త ఆపరేషన్‌లో భాగంగా 208 మందిని అరెస్ట్ చేసినట్లు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ మంగళవారం తెలిపారు. నిందితుల్లో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఏడుగురు విద్యార్థులు, 15 మంది మహిళలు, ఇద్దరు లెక్చరర్లు, విద్యుత్ శాఖ ఉద్యోగి కూడా ఉండటం గమనార్హం. దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ మోసాలకు సంబంధించిన నగదు బదిలీలకు ఉపయోగించే 'మ్యూల్ ఖాతాల'పై ఈ ఆపరేషన్ కేంద్రీకరించింది. నిందితులు 5 శాతం వరకు కమీషన్ తీసుకుని తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించినట్లు దర్యాప్తులో తేలింది. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డేటాను విశ్లేషించిన టీజీసీఎస్‌బీ, తెలంగాణలో తెరిచిన అనుమానాస్పద ఖాతాలను గుర్తించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా 512 మంది సిబ్బందితో కూడిన 137 పోలీస్ బృందాలు రాష్ట్రవ్యాప్తంగా 137 బ్యాంకు బ్రాంచ్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. దేశవ్యాప్తంగా 9,451 కేసులతో సంబంధం ఉన్న 1,888 మ్యూల్ ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ద్వారా సుమారు రూ.100 కోట్ల మోసం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అరెస్టయిన వారిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, జూబ్లీహిల్స్ మర్చంట్ కో-ఆపరేటివ్ బ్యాంకులకు చెందిన ఇద్దరు ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరు సరైన కేవైసీ నిబంధనలు పాటించకుండా ఖాతాలు తెరిచేందుకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 63 మొబైల్ ఫోన్లు, 208 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్ బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్‌లో ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యుల ఖాతాలను కూడా మోసాలకు వాడినట్లు తేలింది. కొందరు నిందితులు నకిలీ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఖాతాలు తెరిచి మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది.

## రైతులను జైల్లో పెట్టడమేంటి?

**కేంద్ర మంత్రి బండి సంజయ్**



సిరిసిల్ల, మార్చి 10 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాగునీటి కాలువ పనుల కోసం ఆందోళన బాట పట్టిన రైతులను పోలీసులు అరెస్టు చేయడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా మండిపడ్డారు. తమ పొలాలకు నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలాలకు సాగునీరు అందించే 11వ ప్యాకేజీ (ఎల్ఎం 4, ఎల్ఎం 6) కాలువ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కాలువ పనుల కోసం రూ. 3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా, ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంపై బండి సంజయ్ విస్మయం వ్యక్తం చేశారు. ఈ పనులు గనుక పూర్తయి ఉంటే దాదాపు 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన అన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉండి కూడా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ ఒక 'రైతు ద్రోహి' అని ఆయన ఘాటుగా విమర్శించారు. అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ వైఫల్యాల వల్లే రైతులు పంటలు నష్టపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతుగా నిలిచిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి సహా ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. రైతులపై అక్రమ కేసులు నమోదు చేస్తే ఊరుకునేది లేదని, వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని హెచ్చరించారు. రైతుల డిమాండ్లు నెరవేరే వరకు బీజేపీ అండగా ఉంటుందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి కాలువ పనులు ప్రారంభించకపోతే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు.




## తెలంగాణకు ఇంత అన్యాయమా?

**హామీల అమలుపై కేంద్రం నిర్లక్ష్యం**

**కేంద్ర మంత్రులు ఏం చేస్తున్నారు?.. కిషన్ రెడ్డి, బండికి పొన్నం లేఖ**

హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు మంగళవారం బహిరంగ లేఖ రాశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు కేంద్రం దయ కాదు..తెలంగాణ హక్కు, తెలంగాణ ప్రజలు పనులు చెల్లిస్తున్నప్పుడు కేంద్రం తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్ లో జరుగుతున్న కేంద్ర బడ్జెట్ చర్చలో తెలంగాణకి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్ట్ లపైన బండి సంజయ్, కిషన్ రెడ్డి లు చర్చించాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రతి బడ్జెట్లో భారీగా నిధులు కేటాయిస్తున్నారని, మేము దానిని వ్యతిరేకించడం లేదు..ఆ రాష్ట్రానికి కేటాయిస్తున్న బడ్జెట్ లో సగం నిధులైన కేంద్రం తెలంగాణకి ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు కేంద్రంతో కొట్లాడి రాష్ట్రానికి రావాల్సిన నిధులు సాధించాలని పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలో ఉన్న 29 రాష్ట్రంగా ఏర్పడి ఎదుగుతున్న తెలంగాణకు కేంద్రం చేయుతనివ్వాలని, విభజన చట్టం హామీలను అమలు చేయడంలో దారుణంగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. తెలంగాణ పై కేంద్రం స్పష్టమైన వివక్ష చూపిస్తోందని, దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా దోహదపడుతున్న తెలంగాణకు ఈ బడ్జెట్‌లోనూ న్యాయం చేయడం లేదని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణకు ఐఐఎం, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఊసు లేదని, ఒక్క ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం చేయడం లేదని ధ్వజమెత్తారు.

## 13న చర్లపల్లి-కామాఖ్య అమృత్ భారత్ రైలు ప్రారంభం

హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని చర్లపల్లి స్టేషన్ నుంచి అసోంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కామాఖ్య వరకు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ప్రకటించింది. ఈ కొత్త రైలు సర్వీసును మార్చి 13న కామాఖ్యలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ రైలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను ఈశాన్య రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉండే అసోంతో కలుపుతుంది. ఈ రైలులో స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి. తక్కువ ఖర్చుతో సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే ఈ రైలు, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లే సుదూర ప్రయాణికులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుందని రైల్వే శాఖ తెలిపింది. ఈ రైలు శ్రీకాకుళం రోడ్, విజయనగరం, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నల్గొండ స్టేషన్లలో ఆగుతుంది. రెండు రోజుల క్రితమే తమిళనాడులోని నాగర్‌కోయిల్ నుంచి చర్లపల్లి వరకు మరో అమృత్ భారత్ రైలును రైల్వే శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఈ రైళ్లను ప్రవేశపెట్టారు. అధునాతన భద్రతా ఫీచర్లు, సెమీ ఆటోమేటిక్ కప్లర్లు, ఫైర్ డిటెక్షన్ సిస్టమ్స్ వంటి సౌకర్యాలతో వీటిని రూపొందించారు. నాన్-ఏసీ కోచ్‌లలో కూడా ప్రయాణికుల భద్రత కోసం ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం ఈ రైళ్ల ప్రత్యేకత.



## నేడు గవర్నర్‌గా శుక్లా ప్రమాణం

**ఘనస్వాగతం పలికిన సీఎం రేవంత్**

హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): రాష్ట్ర కొత్త గవర్నర్‌గా నియమితులైన శివప్రతాప్ శుక్లాకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో సిఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. గవర్నర్‌కు స్వాగతం పలికిన వారిలో సిఎం రేవంత్‌తో పాటు మంత్రి శ్రీధర్ బాబు, సిఎస్ కె. రామకృష్ణా రావు, డిజిపి శివధర్ రెడ్డిలు ఉన్నారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన శుక్లా 2014 ఎన్డీఏ కేబినెట్ లో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ చేతుల మీదుగా కొత్త గవర్నర్‌గా ఆయన ప్రమాణం చేయనున్నారు. దీనికి సంబంధించి లోక్‌భవనోన్‌లో ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. మరోవైపు, బదిలీపై మహారాష్ట్రకు వెళ్తున్న జిష్ణుదేవ్ వర్మ సోమవారం రిలీవ్ అయ్యారు. బేగంపేట ఎయిర్‌పోర్టులో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులకు సీఎస్ రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన వీడ్కోలు పలికారు.

## ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ భేటీ రసాభాస

**కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం, బాహాబాహీ**

ఆదిలాబాద్, మార్చి 10 (ఈవార్తలు): ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. రెండు పార్టీల కౌన్సిలర్లు పరస్పరం చొక్కాలు పట్టుకుని, బాహాబాహీకి దిగారు. ఇరు పార్టీల గందరగోళం మధ్యనే ఛైర్‌పర్సన్ అనూష 'అజెండా పాస్' అంటూ ప్రకటన చేసి తన ఛాంబర్‌లోకి వెళ్లిపోయారు. అయితే చర్చ లేకుండానే అజెండాను ఎలా పాస్ చేస్తారని బీజేపీ కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ ఛాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఛైర్‌పర్సన్, కాంగ్రెస్ కౌన్సిలర్లు బయటకు రాకుండా బీజేపీ కౌన్సిలర్లు అడ్డుకున్నారు. పోలీసులు జోక్యంతో ఛైర్‌పర్సన్ బయటకు వచ్చారు. దీంతో దాదాపు మూడు గంటల పాటు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కాగా, నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. కాంగ్రెస్ కౌన్సిలర్ అజయ్, బీజేపీ కౌన్సిలర్ రాకేష్ మధ్య తోపులాట చోటు చేసుకుంది. పాలకవర్గం సభను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

## ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో భారీ ఊరట

న్యూఢిల్లీ: తెలంగాణను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ప్రభాకర్ రావుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. ఆయనకు అరెస్ట్ నుంచి మినహాయింపు ఇస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ వెసులుబాటుతో పాటు కోర్టు కొన్ని కఠినమైన షరతులను కూడా విధించింది. సిట్ విచారణకు ప్రభాకర్ రావు పూర్తిస్థాయిలో సహకరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసులోని సాక్ష్యాలను గానీ, ఆధారాలను గానీ తారుమారు చేసే ప్రయత్నం చేస్తే బెయిల్ వెంటనే రద్దవుతుందని హెచ్చరించింది. కోర్టు అనుమతి లేకుండా రాష్ట్రం, దేశం విడిచి వెళ్లకూడదని స్పష్టం చేసింది. కేసు వివరాల్లోకి వెళితే... గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలతో రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చిన తర్వాత కేసు నమోదయింది. అప్పట్లో ఇంటెలిజెన్స్ ఐజీగా ఉన్న ప్రభాకర్ రావు పర్యవేక్షణలోనే ఈ ప్రక్రియ సాగిందని సిట్ తన దర్యాప్తులో గుర్తించింది. ఇప్పటికే ఈ కేసులో ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు వంటి ఉన్నతాధికారులు అరెస్టయి విచారణ ఎదుర్కొంటున్నారు.

## లక్షల గొంతుకల పోరాటం

**మిలియన్ మార్చ్‌ను స్మరించుకున్న కేటీఆర్**

హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక ఘట్టమైన 'మిలియన్ మార్చ్'కు నేటితో 15 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగసేలా చేసిన అద్భుత పోరాట రూపాల్లో ఇదొకటని ఆయన పేర్కొన్నారు. ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 2011 మార్చి 10న జరిగిన మిలియన్ మార్చ్‌ను స్మరించుకున్నారు. "స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్‌బండ్‌పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 ఏళ్లు.. నిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు, బ్యారికేడ్లు, ఇనుపకంచెలు ఏవీ తెలంగాణ ఉద్యమకారుల స్ఫూర్తిని దెబ్బతీయలేకపోయాయి" అని కేటీఆర్ తన పోస్టులో రాసుకొచ్చారు. స్వరాష్ట్రం కోసం లక్షల గొంతుకలు ట్యాంక్‌బండ్‌పై ఏకమై నినదించిన అద్భుత పోరాటానికి నేటితో 15 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ తన పోస్టుకు ఆనాటి మిలియన్ మార్చ్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను జతచేశారు. "తెలంగాణ అమరవీరులకు జోహార్లు, జై తెలంగాణ" అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు.



## ఇంకా నిర్ణయం తీసుకోలే!

**కార్యకర్తలతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ**

**మాజీమంత్రి జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**

జగిత్యాల బ్యూరో, మార్చి 10 (ఈవార్తలు): జగిత్యాల రాజకీయాలు మరోసారి హీటెక్కాయి. కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాల కాలంగా కీలక నేతగా ఉన్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, పార్టీ మారుతున్నారనే వార్తలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. జగిత్యాలలోని ఇందిరా భవన్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మంగళవారం చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీలోనే కలకలం రేపుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు పార్టీలో, ప్రభుత్వ ప్రోటోకాల్‌లో అధిక ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల జరిగిన జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు సాధించకపోవడానికి ఎమ్మెల్యే సంజయ్ కుమారే కారణమని ఆయన గతంలోనే నేరుగా ఆరోపించారు. 'ఇంకెంత కాలం ఈ అవమానాలు భరించాలి?' అని ప్రశ్నిస్తూ, పార్టీలో తనకు తగిన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి తాను కాంగ్రెస్ లో కొనసాగాలా? వద్దా? అనే దానిపై తుది నిర్ణయం తీసుకోలేదని... తన అనుచరులు, కార్యకర్తలతో చర్చించిన తర్వాతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని స్పష్టం చేశారు. ఏదైనా మీకు చెప్పే చేస్తానని మీడియాను ఉద్దేశించి అన్నారు.

## తాగి.. బైక్‌తో ఢీకొట్టి చంపి!

**నిందితుడికి 8 ఏళ్ల జైలు శిక్ష.. డ్రంకెన్ డ్రైవ్ ప్రమాదం: ఎస్పీ**

జగిత్యాల టౌన్, మార్చి 10 (ఈవార్తలు): మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒక యువకుడి ప్రాణం తీసిన కేసులో జగిత్యాల కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి 8 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించడంతో పాటు, లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం ఇచ్చిన బైక్ యజమానికి రూ.20 వేల జరిమానా విదిస్తూ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి రత్న పద్మావతి తీర్పు వెలువరించారు. వివరలోకి వెళ్తే.. 2022 ఆగస్టు 9న మెట్‌పల్లి మండలం వెంపేట గ్రామానికి చెందిన మరంపెల్లి నవీన్ కుమార్ మద్యం సేవించి, తన బంధువు మరంపెల్లి అంజయ్యకు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ (టీఎస్-21-ఎల్-3365) బైక్‌ను తీసుకొని అతివేగంగా యూసుఫ్‌నగర్ వైపు వెళ్లాడు. యూసుఫ్‌నగర్ క్రాస్ రోడ్ వద్ద ఎదురుగా వస్తున్న హెచ్ఎఫ్ డీలక్స్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గుండంపల్లి గ్రామానికి చెందిన శివరాత్రి సాగర్ (22) అక్కడికక్కడే మృతి చెందగా, అతని తల్లి లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసులో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, కోర్టు ముందు హాజరుపరిచారు. దీంతో నిందితులకు శిక్ష పడింది. ఈ తీర్పుపై జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్పందించారు. మద్యం సేవించి వాహనం నడపడం ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన మాత్రమే కాకుండా, ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీసే అత్యంత ప్రమాదకరమైన చర్య అని తెలిపారు.



## 'దోస్త్'లా ఇంటర్ అడ్మిషన్లు!

**ఇంటర్ బోర్డు సెక్రటరీకి వినతి**

నాంపల్లి-హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): పదో తరగతి పరీక్షలు కూడా పూర్తి కాకుండానే, ఇంటర్ కాలేజీలు స్కూళ్లలో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభిస్తున్నాయని విద్యార్థి జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరాల ప్రశాంత్ అన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న కాలేజీలపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీని కలిసి వినతి పత్రం అందజేశారు. డిగ్రీ మాదిరి 'దోస్త్' అడ్మిషన్ల ప్రక్రియను ఇంటర్ అడ్మిషన్లకూ వర్తింపజేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జన సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నకరికంటి నరేందర్, రాష్ట్ర నాయకుడు దప్పు గోపి, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు కడారి రమేశ్ యాదవ్, వీజేఎస్ నాయకుడు చెరుకు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## గన్‌పార్క్ అమరుల స్థూపం వద్ద ఘన నివాళి

నాంపల్లి-హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమంలో ప్రధాన ఘట్టమైన మిలియన్ మార్చ్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో గన్ పార్క్‌లో అమరులకు ఘన నివాళి అర్పించారు. 2011 మార్చి 10న జరిగిన మిలియన్ మార్చ్ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కోదండరాం, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు కడారి రమేశ్, తెలంగాణ ఉద్యమకారులు, విద్యార్థి ఉద్యమ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, ఉద్యమ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## బీజేపీ వల్లే భూదాన్ బాధితులకు ఇళ్ల పట్టాలు: వాసుదేవరావు

ఖమ్మం, మార్చి 10 (ఈవార్తలు): ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులకు భారతీయ జనతా పార్టీ అండగా నిలిచిందని, బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు తెలిపారు. ఖమ్మంలోనే మకాం వేసి బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం పోరాటం కొనసాగించామని వెల్లడించారు. 'బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎంపీ ఈటల రాజేందర్‌కు బాధితుల పరిస్థితిని వివరించాం. జాతీయ ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్లకు ఫిర్యాదు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరాం' అని వివరించారు. కాగా, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అలాగే అంబేద్కర్ భవనంలో ఆశ్రయం పొందుతున్న భూదాన్ బాధితులకు భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.



# శాంసంగ్ 20 వసంతాలు

**ప్రపంచంలో నం.1 టీవీ బ్రాండ్‌గా అవతరణ.. 2006 నుంచి ఏటా అగ్రస్థానం కైవసం**

హైదరాబాద్, మార్చి 10 (ఈవార్తలు): శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ రెండు దశాబ్దాలుగా టెలివిజన్ పరిశ్రమలో ప్రపంచ నాయకత్వం ప్రదర్శిస్తూ, వరుసగా 20వ సంవత్సరాల పాటు ప్రపంచంలోని నంబర్ 1 టీవీ బ్రాండ్‌గా నిలిచింది. శామ్‌సంగ్ 2006 నుంచి ప్రపంచ టీవీ మార్కెట్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మార్కెట్ పరిశోధన సంస్థ ఒమ్డియా ప్రకారం, 2025లో కంపెనీ ప్రపంచ టీవీ మార్కెట్‌లో 29.1% వాటాను నమోదు చేసింది. ఈ విజయం ప్రీమియం, అల్ట్రా-లార్జ్ మరియు తదుపరి తరం డిస్ప్లే టెక్నాలజీలలో శామ్‌సంగ్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తోంది. శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ 2,500 డాలర్ల కంటే ఎక్కువ ధర కలిగిన ప్రీమియం టీవీ విభాగంలో 54.3% మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఈ వృద్ధికి నియో క్యూఎల్ఈడీ, ఓఎల్ఈడీ, శామ్‌సంగ్ లైఫ్‌స్టైల్ టీవీలు కీలకంగా దోహదపడ్డాయి. అదేవిధంగా, 1,500 డాలర్ల కంటే ఎక్కువ ధర కలిగిన సెగ్మెంట్‌లో కూడా కంపెనీ 52.2% మార్కెట్ వాటాతో తన ఆధిక్యాన్ని కొనసాగించింది. 'వినియోగదారులు టీవీని ఎంచుకునేటప్పుడు, రాబోయే సంవత్సరాల్లో విశ్వసించగలిగే బ్రాండ్‌ను కూడా ఎంచుకుంటారు' అని విజువల్ డిస్ప్లే బిజినెస్ ప్రెసిడెంట్, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ హెడ్ ఎస్‌డబ్ల్యూ యాంగ్ తెలిపారు.

**2006 నుంచి శాంసంగ్ ఘనతలు ఇలా..**

- 2009: కంపెనీ ఎల్ఈడీ టీవీల వైపు ప్రపంచ మార్పును వేగవంతం చేస్తూ, మరింత సన్నని, శక్తి-సమర్థవంతమైన డిస్ప్లేల కోసం కొత్త ప్రమాణాలను నిర్దేశించింది.
- 2011: స్మార్ట్ టీవీల పరిచయం టెలివిజన్లను కనెక్ట్ చేయబడిన వినోద వేదికలుగా మార్చింది, సంప్రదాయ వీక్షణకు మించి వాటి పాత్రను విస్తరించింది.
- 2015: ఇంటి లోపల స్క్రీన్‌ను స్టేట్‌మెంట్ పీస్‌గా ఉంచే డిజైన్-ఫోకస్డ్ టీవీని ప్రవేశపెట్టడం ద్వారా టీవీలు నివాస స్థలాలలో ఎలా కలిసిపోతాయో ది సెరిఫ్ తిరిగి ఊహించింది.
- 2017: కంపెనీ ది ఫ్రేమ్‌ను ప్రారంభించింది, టెలివిజన్‌ను అనుకూలీకరించదగిన డిజిటల్ ఆర్ట్ కాన్వాస్‌గా మార్చడం ద్వారా ఆర్ట్ టీవీ వర్గానికి మార్గదర్శకంగా నిలిచింది.
- 2017: ప్రీమియం పిక్చర్ నాణ్యతలో, క్వాంటం డాట్ టెక్నాలజీతో నడిచే క్యూఎల్ఈడీ టీవీలను ప్రవేశపెట్టడంతో శామ్‌సంగ్ పరిశ్రమ ప్రమాణాలను సెట్ చేయడం కొనసాగించింది.
- 2018: 8కే టీవీలు 33 మిలియన్ పిక్సెల్‌లకు పైగా అందించబడ్డాయి - 4కే కంటే నాలుగు రెట్లు రిజల్యూషన్.
- 2020: శామ్‌సంగ్ మైక్రో ఎల్ఈడీ టెక్నాలజీని ప్రవేశపెట్టింది, స్వీయ-ఉద్గార ప్రదర్శన ఆవిష్కరణను అభివృద్ధి చేసింది మరియు అల్ట్రా-లార్జ్ స్క్రీన్‌లలో ప్రకాశం, కాంట్రాస్ట్ మరియు రంగు కచ్చితత్వం కోసం కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. పిక్చర్ క్వాలిటీ, స్మార్ట్ ఫంక్షనాలిటీ, ప్రదర్శన ఆవిష్కరణలలో నిరంతర పురోగతుల ద్వారా, శాంసంగ్ నేటి ప్రీమియం టీవీ ప్రమాణాలను స్థాపించడంలో నిర్వచించే పాత్ర పోషించింది.




# చిన్న పత్రికలను చిదిమేయకండి

**ప్రభుత్వ ప్రకటనల బిల్లులు చెల్లించాలి.. ఐఅండ్ పీఆర్ కమీషనర్‌కు మామిడి సోమయ్య విజ్ఞప్తి**



హైదరాబాద్, మార్చి10 (ఈవార్తలు): రాష్ట్రంలోని చిన్న,మధ్యతరహా పత్రికలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, ఈ ధోరణి సరైంది కాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లుగా చిన్న, మధ్య తరహా పత్రికలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయని అన్నారు. చిన్న మధ్య తరహా పత్రికలకు, పీరియాడికల్స్ కు రాష్ట్ర ప్రభుత్వం సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ఇచ్చిన ప్రకటనలకు సంబంధించిన బిల్లుల బకాయిలను ఇంతవరకు చెల్లించకుండా జాప్యం చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. ఒకవైపు అడ్వర్టైజ్మెంట్లు సక్రమంగా ఇవ్వకుండా, మరోవైపు ఇచ్చిన అడ్వర్టైజ్మెంట్లకు బిల్లులు ఇవ్వకుండా జర్నలిస్టులను, పత్రికల నిర్వహాకులను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. ప్రభుత్వ అణిచివేత ధోరణి వల్ల పత్రికల ప్రచురణకర్తలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికల ప్రకటనల కోసం బడ్జెట్ ఉన్నప్పటికీ పిరియాడికల్స్,చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వం అరకొర నిధులు కేటాయిస్తుందని, అయినప్పటికీ రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు కేవలం కొన్ని పెద్ద పత్రికలకు, యాడ్ ఏజెన్సీలకు మాత్రమే పెద్ద పీట వేసి సకాలంలో వాటికి బిల్లులు చెల్లిస్తూ, చిన్న మధ్య తరహా పత్రికలకు పెండింగ్ పెడుతున్నారని ఆరోపించారు. పైగా గత కొన్ని నెలలుగా పిరియాడికల్స్ కు ప్రభుత్వం ఇచ్చే ప్రకటలు పూర్తిగా నిలిపివేశారని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ కు ప్రభుత్వ నుండి రావాల్సిన అడ్వర్టైజ్మెంట్స్ బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. అదేవిధంగా రెగ్యులారిటీ ఉన్న చిన్న,మధ్య తరహా దిన పత్రికలు, పీరియాడికల్స్ ను ఎంపానల్మెంట్ చేయాలని, చిన్న పత్రికలకు పెద్ద పత్రికలతో సమానంగా ప్రభుత్వ ప్రకటనలు రెగ్యులర్ గా విడుదల చేయాలని,అడ్వర్టైజ్మెంట్స్ కు ఇవ్వాల్సిన బిల్లులను సకాలంలో విడుదల చేయాలని కోరారు. కాగా చిన్న, మధ్య తరహా పత్రికల పెండింగ్ బిల్స్ విషయమై మామిడి సోమయ్య మంగళవారం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంకతో ఫోన్లో మాట్లాడారు. బిల్స్ రాక చాలా మంది పత్రికల నిర్వహకులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బిల్స్ చెల్లించాలని ఆయన కమీషనర్ ను కోరారు. పెండింగ్ బిల్స్ విడుదల చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ చెప్పారని మామిడి సోమయ్య తెలిపారు.

## ఏపీలో గ్యాస్ కొరత లేదు: నాదెండ్ల

విజయవాడ, మార్చి 10 (ఈవార్తలు): ఏపీలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గృహ, వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సరఫరాలో ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేవని ఆయన భరోసా ఇచ్చారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో, రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై మంత్రి మంగళవారం ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కీలక సమయంలో గ్యాస్‌ను అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా జిల్లా జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించడం, ఇష్టానుసారం ధరలు పెంచడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడటమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని మంత్రి తెలిపారు.



## అలిపిరి వద్ద భారీగా నగదు స్వాధీనం

తిరుమల, మార్చి 10 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తుల రద్దీ కొనసాగుతున్న వేళ, అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద భారీ మొత్తంలో నగదు పట్టుబడటం కలకలం రేపింది. టీటీడీ విజిలెన్స్ విభాగం నిర్వహించిన సాధారణ తనిఖీల్లో ఒక కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.60 లక్షల నగదును అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం ఒక వ్యక్తి తన కారులో తిరుమల కొండపైకి వెళుతుండగా, అలిపిరి వద్ద విజిలెన్స్ సిబ్బంది వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈ క్రమంలో కారులో దాచి ఉంచిన కరెన్సీ కట్టలు బయటపడ్డాయి. దీనిపై విజిలెన్స్ అధికారులు సదరు వ్యక్తిని నిలదీయగా, తిరుమలలో నాణేల మార్పిడి కోసం ఈ నగదును తీసుకెళుతున్నట్టు పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. అంత భారీ మొత్తానికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేదా బ్యాంకు పత్రాలు చూపకపోవడంతో, విజిలెన్స్ అధికారులు నగదుతో పాటు సదరు వ్యక్తిని అలిపిరి పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ నగదు ఎక్కడి నుంచి వచ్చింది? దీని అసలు యజమాని ఎవరు? నిజంగానే నాణేల కోసమా లేక ఇతర రాజకీయ లేదా వ్యాపార లావాదేవీల కోసమా? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే తిరుమలలో పలు ఘటనలు చర్చనీయాంశంగా మారిన తరుణంలో, ఈ భారీ నగదు పట్టుబడటం మరిన్ని ప్రశ్నలకు దారితీస్తోంది.

## పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి చుక్కెదురు

పల్నాడు జిల్లా, మార్చి 10 (ఈవార్తలు): పల్నాడు జిల్లా గుండ్లపాడులో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ నేత పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను గురజాల కోర్టు సోమవారం కొట్టివేసింది. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేయలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. గతేడాది గుండ్లపాడుకు చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావు హత్యకు గురయ్యారు. తెలంగాణలోని హుజూర్‌నగర్‌లో ఒక వివాహానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా, వెల్దుర్తి మండలం బొదిలవీడు సమీపంలో వారిని వాహనంతో ఢీకొట్టి హతమార్చారు. ఈ హత్యల వెనుక పిన్నెల్లి సోదరుల ప్రమేయం ఉందని ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఏ-7 నిందితుడిగా ఉన్నారు. ఆయన తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన గురజాల కోర్టు, కేసు పూర్వాపరాలను, గాంభీర్యాన్ని దృష్టిలో ఉంచుకొని బెయిల్‌ను తిరస్కరించింది. తాజా తీర్పుతో వెంకట్రామిరెడ్డి జైలులోనే కొనసాగనున్నారు.

# 4 కేటగిరీలుగా గ్రామ పంచాయతీలు

**ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం**




అమరావతి, మార్చి 10 (ఈవార్తలు): ఏపీలో గ్రామ పంచాయతీల స్వరూపాన్ని మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల పునర్వర్గీకరణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు మూడు రకాలుగా ఉన్న పంచాయతీలను, ఇకపై జనాభా, వార్షిక ఆదాయం ఆధారంగా నాలుగు కేటగిరీలుగా విభజించింది. ఇందులో భాగంగా పట్టణ లక్షణాలు సంతరించుకుంటున్న పెద్ద గ్రామాలను గుర్తిస్తూ కొత్తగా 'రూర్బన్' (రూరల్ ప్లస్ అర్బన్) పంచాయతీ కేటగిరీని ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పరిపాలన, పౌర సేవలు అందించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ కొత్త వర్గీకరణ ప్రకారం రూర్బన్ పంచాయతీలలో పట్టణాలకు దీటుగా మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

**కొత్తగా నాలుగు కేటగిరీలు.. వివరాలు:**

రూర్బన్ పంచాయతీ: 10 వేలకు పైగా జనాభా, రూ.కోటి కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో అయితే 5 వేలకు పైగా జనాభా ఉంటే సరిపోతుంది. ఈ పంచాయతీలలో పట్టణ తరహా సౌకర్యాలు కల్పిస్తారు.

గ్రేడ్-1 పంచాయతీ: 3 వేల నుంచి 10 వేల మధ్య జనాభా, రూ.30 లక్షల నుంచి రూ.కోటి లోపు వార్షిక ఆదాయం ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో 2,500 నుంచి 5 వేల మధ్య జనాభా ఉండాలి. మండల కేంద్రంగా ఉన్న పంచాయతీలు ఈ గ్రేడ్ కిందికి వస్తాయి.

గ్రేడ్-2 పంచాయతీ: 2 వేల లోపు జనాభా ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో జనాభా 1,500 నుంచి 2 వేల మధ్య ఉండాలి.


గ్రేడ్-3 పంచాయతీ: 1,500 కంటే తక్కువ జనాభా ఉన్న పంచాయతీలను ఈ కేటగిరీలో చేర్చారు.

ఈ నూతన వర్గీకరణతో పంచాయతీలకు వాటి జనాభా, ఆదాయ వనరులకు అనుగుణంగా నిధుల కేటాయింపు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన సులభతరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పెద్ద గ్రామాల్లో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సేవలు అందించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ



అమరావతి, మార్చి 10 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌ను 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్' ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# బుడగలు ఊదిన 'కుర్ర' సూర్యుడు

కోటానుకోట్ల నక్షత్రాలు.. కోట్ల కొలది సౌర మండలాలు.. వాటిని చుట్టుముట్టే పాలపుంతలు.. ఇవి కాకుండా ధూళి, దుమ్ము, వాయువులు, కృష్ణ పదార్థం.. ఇలా చెప్పుకుంటూపోతే విశ్వం అనంతమైనది. ఈ అంతుపట్టని విశ్వంలో ఓ అద్భుతాన్ని చూశారు నాసా శాస్త్రవేత్తలు. ఓ పాలపుంతలో కుర్ర సూర్యుడు బుడగలు ఊదుతూ కనిపించాడు. ఈ అద్భుతాన్ని నాసాకు చెందిన చంద్ర ఎక్స్-రే అబ్జర్వేటరీ తన కెమెరాలో బంధించింది. ఇలాంటి చిత్రం దొరకడం ఖగోళ శాస్త్రంలో తొలిసారి. ఈ ఆవిష్కరణతో మన సూర్యుడు తొలినాళ్లలో ఎలా ప్రవర్తించాడో తెలుసుకోవచ్చని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# విజయ్-త్రిషతో ప్రజలకేం లొల్లి?: ఖుష్బూ

ముంబై: ప్రముఖ తమిళ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్, నటి త్రిష వ్యవహారంపై తమిళనాడు బీజేపీ నాయకురాలు ఖుష్బూ స్పందించారు. వీరి విషయంలో ప్రజలకు ఏం ఆసక్తి అనేది తనకు అర్థం కావడం లేదని అన్నారు. ఈ వ్యవహారంతో ప్రజలకు ఎలాంటి సంబంధం లేదని అభిప్రాయపడ్డారు. అది వారి వ్యక్తిగత విషయమని వెల్లడించారు. దీనిని ఎందుకు పెద్ద విషయంగా చూస్తున్నారని వ్యాఖ్యానించారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమానికి ఖుష్బూ హాజరయ్యారు. ఈ క్రమంలో విజయ్, త్రిష అంశం తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీపై ప్రభావం చూపుతుందా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. ఖుష్బూ స్పందిస్తూ, ఎవరికి, ఎందుకు ఓటు వేయాలో ప్రజలకు బాగా తెలుసని అన్నారు. వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని అన్నారు.




# గర్భస్థ పిండంతో హైకోర్టుకు

**మధ్యప్రదేశ్‌లో దిగ్భ్రాంతికర ఘటన**

**ఏఎస్సై సహా నలుగురు పోలీసులపై వేటు**

జబల్‌పూర్: మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్‌పూర్ బెంచ్‌లో జరిగిన తీవ్ర భద్రతా వైఫల్యంపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. కోర్టు ప్రాంగణంలో భద్రతా లోపం ఆరోపణలపై ఒక అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) సహా నలుగురు పోలీసు సిబ్బందిని మంగళవారం సస్పెండ్ చేశారు. ఒక పిటిషనర్ కోర్టు హాలులోకి పిండంతో ప్రవేశించిన ఘటన జరిగిన మరుసటి రోజే ఈ చర్యలు తీసుకోవడం గమనార్హం. సోమవారం జరిగిన ఈ అనూహ్య ఘటన వివరాల్లోకి వెళితే.. రేవా జిల్లాకు చెందిన దయాశంకర్ పాండే అనే వ్యక్తి తన పిటిషన్‌పై విచారణ కోసం హైకోర్టుకు వచ్చాడు. గేట్ నంబర్-6 ద్వారా లోపలికి ప్రవేశించిన అతను, జస్టిస్ హిమాన్షు జోషి కోర్టు హాలులోకి వెళ్లాడు. విచారణ జరుగుతుండగా, తన బ్యాగులో నుంచి ఒక పిండం తీసి న్యాయమూర్తి వేదికపై పెట్టి, తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. దీంతో కోర్టు హాలులో ఉన్నవారంతా ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. అది తన భార్యకు గర్భస్రావం కావడంతో మృతిచెందిన పిండమని పోలీసులు తెలిపారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన జబల్‌పూర్ ఎస్పీ సంపత్ ఉపాధ్యాయ, భద్రతా వైఫల్యానికి బాధ్యులను చేస్తూ నలుగురు పోలీసులను సస్పెండ్ చేశారు. సస్పెండైన వారిలో ఏఎస్ఐ మున్నా అహిర్వార్, హెడ్ కానిస్టేబుళ్లు బ్రహ్మదత్ ఖత్రీ, అరుణ్ ఉపాధ్యాయ, కానిస్టేబుల్ ప్రతీక్ సోంకర్ ఉన్నారు. ఘటన జరిగిన సమయంలో వీరంతా గేట్ నంబర్-6 వద్ద విధుల్లో ఉన్నారు. తన సొంత ఊరిలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తనపై, తన కుటుంబంపై పలుమార్లు దాడులు చేశారని, స్థానిక పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ దయాశంకర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ రోజే ఈ ఘటన చోటుచేసుకుంది.

# దోశ, బోండా బంద్!

## హోటళ్లలో పలు టిఫిన్లకు గుడ్‌బై.. యుద్ధంతో గ్యాస్ కొరత

బెంగళూరు: ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో వంట గ్యాస్ కొరత ఏర్పడి బెంగళూరు, ముంబై, ఢిల్లీ, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో హోటళ్లు తాత్కాలికంగా మూతపడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్ల సరఫరా చాలా వరకు తగ్గిపోయింది. దీంతో ఆయా నగరాల్లో రెస్టారెంట్లు, హోటళ్లు మూతపడుతున్నాయి. సిలిండర్ల కొరత కారణంగా హోటల్స్, రెస్టారెంట్ల యాజమాన్యాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. గ్యాస్ ఎక్కువగా అవసరమయ్యే ఫలహారాలను తమ మెనూ జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఉదాహరణకు దోశ, మైసూర్ బజ్జీ, వడ వంటి వాటిని మెనూ నుంచి తొలగిస్తున్నారు. వాటికి బదులు శాండ్ విచ్ వంటి ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఓవెన్‌తో అందించే ఫలహారాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా మెనూలో మార్పులు చేస్తున్నామని హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు చెబుతున్నారు. దోశ, వడ వంటి పదార్థాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. అధిక గ్యాస్ వినియోగమయ్యే ఫలహారాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.



# ఆంత్రోపిక్ పేరు కాపీ కొట్టారు!

**అమెరికా ఏఐ దిగ్గజానికి కోర్టులో ఎదురుదెబ్బ**

**ఆంత్రోపిక్ పేరుపై ట్రేడ్‌మార్క్ వివాదం**

న్యూయార్క్: 'ఆంత్రోపిక్' పేరుపై నడుస్తున్న ట్రేడ్‌మార్క్ ఉల్లంఘన కేసులో ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంస్థ ఆంత్రోపిక్ పీబీసీకి, దాని భారత అనుబంధ సంస్థ ఆంత్రోపిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కర్ణాటకలోని బెళగావి కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఇకపై ఈ రెండు కంపెనీలు కేసు విచారణకు హాజరుకావాల్సిందేనని ఆంత్రోపిక్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అయాజ్ ముల్లా మంగళవారం వెల్లడించారు. ఈ కేసును దాఖలు చేసింది ముల్లాకు చెందిన సంస్థే కావడం గమనార్హం. ఈ కేసుకు సంబంధించి మార్చి 9న జరిగిన విచారణ వివరాలను అయాజ్ ముల్లా ఐఏఎన్ఎస్‌తో పంచుకున్నారు. "గత విచారణలో మేము ఆంత్రోపిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సమన్లు జారీ చేశాం. మార్చి 9న వారు కోర్టు ముందు హాజరయ్యారు. అయితే, కేసులో ప్రతివాదిగా ఉన్నది అమెరికాకు చెందిన ఆంత్రోపిక్ పీబీసీ అని, తాము వేరే చట్టపరమైన సంస్థ అని ఆంత్రోపిక్ భారత అనుబంధ సంస్థ వాదించింది" అని ముల్లా వివరించారు. ఈ వాదనతో కేసు నుంచి తప్పించుకోవాలని వారు ప్రయత్నించినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసినప్పటి నేపథ్యాన్ని ముల్లా వివరిస్తూ, "మేము ఈ ఏడాది జనవరి ఆరంభంలో కేసు దాఖలు చేసినప్పుడు, ఆంత్రోపిక్ భారత అనుబంధ సంస్థ ఇంకా నమోదు కాలేదు. అందుకే మేము నేరుగా అమెరికా కంపెనీని ప్రతివాదిగా చేర్చాం. అయితే, ఆంత్రోపిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జనవరి చివరిలో రిజిస్టర్ అయింది" అని అన్నారు. ఇప్పుడు ఆ సంస్థకు భారత్‌లో కార్యాలయం ఉన్నందున, సమన్లను స్థానిక చిరునామాకు పంపినట్లు తెలిపారు. అయితే, తాము సాంకేతికంగా వేర్వేరు కంపెనీలమని, కాబట్టి




ఈ కేసు తమకు వర్తించదని భారత విభాగం ప్రతినిధులు వాదించారని ఆయన వెల్లడించారు. ఈ వాదనను తాము కోర్టులో వ్యతిరేకించామని ముల్లా చెప్పారు. "వారి వాదనను అడ్డుకుని, భారత అనుబంధ సంస్థను కూడా ఈ కేసులో చేర్చాలని (ఇంప్లీడ్) మేము కోరాం. మా అభ్యర్థనను కోర్టు అంగీకరించింది. దీంతో కేసును విజయవంతంగా కొనసాగించే అవకాశం మాకు లభించింది" అని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇకపై జరగబోయే విచారణలకు అమెరికా మాతృసంస్థతో పాటు భారత అనుబంధ సంస్థ కూడా హాజరై సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులో పూర్తి భారతీయ సంస్థగా ఉన్న ఆంత్రోపిక్ సాఫ్ట్ వేర్ సంస్థ... అంతర్జాతీయ టెక్ దిగ్గజం ఆంత్రోపిక్ తోనూ, దాని భారత అనుబంధ సంస్థతోనూ చేస్తున్న ఈ న్యాయపోరాటం ఆసక్తిని రేపుతోంది. ఆంత్రోపిక్ ట్రేడ్‌మార్క్ తమదేనని అయాజ్ ముల్లా చెబుతున్నారు. 2017 నుంచే తాము ఆంత్రోపిక్ అనే పేరును ఉపయోగిస్తున్నామని తెలిపారు.

# ముందుగా వచ్చి ముందుగా వెళ్లొచ్చు

**మహిళా ఉద్యోగులకు కీలక వెసులుబాటు**

**పనివేళల్లో మహారాష్ట్ర సర్కార్ వెసులుబాటు**

ముంబై: ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు మద్దతుగా మహారాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలోని మహిళా ప్రభుత్వ ఉద్యోగుల కోసం 'కమ్ ఎర్లీ-గో ఎర్లీ' (ముందుగా రండి-ముందుగా వెళ్లండి) పేరుతో కొత్త విధానాన్ని ప్రకటించింది. రాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రి సునేత్ర అజిత్ పవార్ మంగళవారం శాసనమండలిలో ఈ విషయాన్ని వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన చర్చకు సమాధానమిస్తూ ఆమె ఈ ప్రకటన చేశారు. ఈ కొత్త పాలసీ ప్రకారం, మహిళా ఉద్యోగులు తమ సౌలభ్యాన్ని బట్టి ఉదయం 9:15 నుంచి 9:45 గంటల మధ్య కార్యాలయానికి రావచ్చు. ఇలా ముందుగా వచ్చిన వారికి, నిర్దేశిత పనివేళల కంటే 30 నిమిషాల ముందే కార్యాలయం నుంచి వెళ్లిపోయేందుకు అనుమతిస్తారు. "రద్దీ వేళల్లో తీవ్రమైన ట్రాఫిక్, కిక్కిరిసిన లోకల్ రైళ్ల నుంచి మహిళలకు ఉపశమనం కల్పించడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశం" అని సునేత్ర పవార్ వివరించారు. మహిళా భద్రత, ఆర్థిక స్వాతంత్ర్యం, ఆరోగ్యం లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను ఆమె సభకు వివరించారు. మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు ఇస్తున్నామని, ప్రసవానంతరం అవసరమైతే మెడికల్ సర్టిఫికెట్ లేకుండానే ఏడాది వరకు సగం జీతంతో సెలవు తీసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. 'ఆపరేషన్ ముస్కాన్' ద్వారా 2015 నుంచి ఇప్పటివరకు 42,594 మంది పిల్లల ఆచూకీ కనుగొన్నట్లు చెప్పారు. 'లాడ్కీ బహీన్', 'నమో మహిళా సశక్తికరణ్', 'లఖ్‌పతి దీదీ' వంటి పథకాలను ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని పవార్ పేర్కొన్నారు. స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను 'ఉమేద్ మాల్స్', ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా మార్కెట్ చేస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టడం, బాలికల డ్రాపౌట్ రేటు తగ్గించడం కోసం 'ఆదిశక్తి అభియాన్' ప్రారంభించినట్లు చెప్పారు. మహిళలపై సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేశామన్నారు. ఇదే అంశంపై సోమవారం శాసనసభలో మాట్లాడిన మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అదితి తత్కరే, ఆన్‌లైన్ వేధింపులు, డిజిటల్ దాడులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళల పురోగతికి సైబర్ నేరాలు అతిపెద్ద అవరోధంగా మారాయని, గ్రామీణ మహిళలకు డిజిటల్ ఫైనాన్స్, సోషల్ మీడియాపై అవగాహన కల్పిస్తామని ఆమె తెలిపారు.



# మొజ్తబాను వదల: ట్రంప్



వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరాయి. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా ఎంపికైన మొజ్తబా ఖమేనీని లక్ష్యంగా చేసుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. "అతను ప్రశాంతంగా జీవించగలడని నేను అనుకోవడం లేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి తర్వాత ఆయన కుమారుడైన 56 ఏళ్ల మొజ్తబా ఖమేనీని కొత్త అధినేతగా ఎన్నుకున్నారు. ఈ నిర్ణయంపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇరాన్ ఈ నాయకుడిని ఎన్నుకోవడంపై నేను సంతోషంగా లేను. అతను ప్రశాంతంగా బతకలేడు" అని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ నియామక ప్రక్రియలో వెనెజువెలా తరహాలోనే తన ప్రమేయం కలిగి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు, ఖమేనీ విధానాలు గత పాలకుల మాదిరే కొనసాగితే ఐదేళ్లలో మరో యుద్ధం తప్పదని ట్రంప్ హెచ్చరించారు. "ఆ పదవిలో కొనసాగాలంటే అతను మా అనుమతి తీసుకోవాలి. లేకపోతే ఎక్కువ కాలం ఉండలేడు" అని ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ వ్యాఖ్యానించారు.

# యుద్ధంతో రష్యాకు బెనిఫిట్: ఈయూ

బ్రస్సెల్స్: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం వల్ల ప్రయోజనం పొందుతున్న ఏకైక దేశం రష్యా అని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియా కోస్టా అన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచంలో ఇంధన ధరలు భారీగా పెరుగుతున్నాయని అన్నారు. దీని వల్ల ఈ యుద్ధం వల్ల గెలిచిన వారెవరైనా ఉన్నారా అంటే రష్యా మాత్రమే అన్నారు. బ్రస్సెల్స్‌లో ఈయూ రాయబారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్రెయిన్‌పై రష్యా నాలుగేళ్లుగా యుద్ధం చేస్తోందని, ఈ యుద్ధాన్ని కొనసాగించడానికి తాజా ఇంధన ధరల పెరుగుదల మంచి ఆర్థిక వనరుగా మారిందని అన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల పైనే ప్రధాన దృష్టి ఉండటంతో ఉక్రెయిన్‌పై కొంత శ్రద్ధ తగ్గిందని అన్నారు. తద్వారా రష్యా ప్రయోజనం పొందుతోందని అన్నారు. అంతర్జాతీయ చట్టాలను అమెరికా సవాల్ చేస్తోందని, వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత ఈయూపై ఉందని ఆంటోనియా కోస్టా పేర్కొన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు పశ్చిమాసియాలో భాగస్వామ్య పక్షాలన్నీ ఒకే తాటిపైకి రావాల్సి ఉందని అన్నారు. బాంబుల ద్వారా స్వేచ్ఛా, మానవ హక్కులు సాధించలేమని అన్నారు. అంతర్జాతీయ చట్టాల ద్వారానే ఇది సాధ్యమని అన్నారు. ఈ పరిస్థితులు మరింత తీవ్రరూపం కాకుండా చూడాలని లేదంటే పశ్చిమాసియా, యూరప్‌తో పాటు ఇతర ప్రాంతాలకు కూడా ముప్పేనని అన్నారు.

# రిజిజు వర్సెస్ ప్రియాంక

**పార్లమెంట్‌లో రభస.. మోదీకి రాహుల్ ఆలింగనంపై రచ్చ**

న్యూఢిల్లీ: పార్లమెంటులో గతంలో ప్రధాని నరేంద్ర మోదీని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆలింగనం చేసుకున్న ఘటనపై లోక్ సభలో అధికార, విపక్ష నేతల మధ్య మాటల యుద్ధం జరిగింది. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాపై తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానంపై ఈరోజు సభలో చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, గతంలో రాహుల్ గాంధీ మోదీ వద్దకు వచ్చి ఆలింగనం చేసుకుని వెళ్లి తన సీట్లో కూర్చున్నాడని వెల్లడించారు. ఆ తర్వాత తోటి కాంగ్రెస్ ఎంపీలను చూసుకుని కళ్లెగరేశారని, అలాంటి నేతను ఎప్పుడూ చూడలేదని ఆయన పేర్కొన్నారు. మోదీని రాహుల్ గాంధీ ఆలింగనం చేసుకోవడంపై కిరణ్ రిజిజు విమర్శలు చేయగా, కాంగ్రెస్ వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ తీవ్రంగా స్పందించారు. గత పన్నెండేళ్లలో కేంద్ర ప్రభుత్వానికి దీటుగా నిలిచిన వ్యక్తి రాహుల్ గాంధీయే అన్నారు. అలాంటి నాయకుడిపై విమర్శలు చేస్తున్నారని అన్నారు.

# ఇండిగో సీఈవో రాజీనామా

**వ్యక్తిగత కారణాలతోనేనని వెల్లడి**




న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగోలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) పీటర్ ఎల్బర్స్ తన పదవికి తక్షణమే రాజీనామా చేశారు. గత డిసెంబర్‌లో సంస్థ ఎదుర్కొన్న తీవ్రమైన ఆపరేషనల్ సంక్షోభం జరిగిన మూడు నెలలకే ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. అయితే, రాజీనామాకు వ్యక్తిగత కారణాలను ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఇండిగో సంస్థ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఎల్బర్స్ రాజీనామా తక్షణమే అమల్లోకి వస్తుందని వెల్లడించింది. "వ్యక్తిగత కారణాల వల్ల సీఈఓ పదవి నుంచి తప్పుకుంటున్నాను. నోటీస్ పీరియడ్‌ను మినహాయించాలని కోరుతున్నాను" అని ఎల్బర్స్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఆయన రాజీనామాను ఇండిగో బోర్డు ఆమోదించింది. 2022 సెప్టెంబర్ నుంచి ఆయన అందించిన సేవలకు ధన్యవాదాలు తెలిపింది. కొత్త సీఈఓను నియమించే వరకు సంస్థ సహ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ భాటియా తాత్కాలికంగా బాధ్యతలు నిర్వహిస్తారు. గత ఏడాది డిసెంబర్‌లో ఇండిగో చరిత్రలోనే అత్యంత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంది. భారీ సంఖ్యలో విమానాలు రద్దు కావడం, గంటల తరబడి ఆలస్యమవ్వడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒకానొక దశలో ఒకే రోజు 300కు పైగా విమానాలు రద్దయ్యాయి. పైలట్ల కొరత, డీజీసీఏ కొత్త నిబంధనలు వంటివి ఈ సమస్యకు కారణమయ్యాయి. ఈ వైఫల్యాలపై అప్పట్లో ఎల్బర్స్ స్వయంగా క్షమాపణలు చెప్పగా, డీజీసీఏ ఆయనకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసింది. కాగా, సీఈఓ రాజీనామా వార్తల నేపథ్యంలో ఇండిగో షేర్లు ఎన్ఎస్ఈలో 3.46 శాతం పెరిగి రూ.4,383.50 వద్ద ముగియడం విశేషం. పూర్తిస్థాయి సీఈఓ కోసం అన్వేషణ ప్రారంభించినట్లు సంస్థ తెలిపింది.

# పాక్ మంత్రులకు జీతాలు కట్

**ప్రధాని షరీఫ్ సంచలన నిర్ణయాలు.. ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్**

ఇస్లామాబాద్: పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయిల్ ధరల పెరుగుదల పాకిస్థాన్‌ను ఊపిరాడనీయకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల ప్రభావంతో చమురు దిగుమతులు ప్రియమవ్వడంతో, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రధాని షెహబాజ్ షరీఫ్ అత్యంత కఠినమైన పొదుపు చర్యలు ప్రకటించారు. గల్ఫ్ దేశాల నుంచి వచ్చే చమురు సరఫరాపైనే తమ దేశం ఆధారపడి ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఖర్చులను తగ్గించుకోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు ఇకపై వారానికి నాలుగు రోజులు (సోమవారం నుంచి గురువారం వరకు) మాత్రమే పనిచేస్తాయి. అయితే బ్యాంకులు, ఆసుపత్రులు, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఈ నిబంధన వర్తించదు. వచ్చే రెండు వారాల పాటు స్కూళ్లు, కాలేజీలు మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఉన్నత విద్యా సంస్థలు తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, అధికారిక వాహనాలకు ఇచ్చే పెట్రోల్ కోటాను 50 శాతానికి తగ్గించారు. అలాగే రాబోయే రెండు వారాల పాటు 60 శాతం ప్రభుత్వ వాహనాలను రోడ్డెక్కించబోమని ప్రధాని తెలిపారు. అంబులెన్స్‌లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు దీని నుంచి మినహాయింపు ఇచ్చారు. మంత్రులు, సలహాదారులు రాబోయే రెండు నెలల పాటు ఎటువంటి జీతాలు తీసుకోరు. పార్లమెంటు సభ్యులందరికీ 25 శాతం, రూ. 3 లక్షల కంటే ఎక్కువ సంపాదించే ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం జీతాల్లో కోత విధించారు. ప్రధాని, ముఖ్యమంత్రులు, గవర్నర్లు సహా అందరు ప్రజాప్రతినిధులు, అధికారుల విదేశీ పర్యటనలపై పూర్తి నిషేధం విధించారు. కేవలం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అనుమతి ఉంటుంది.

# బీజేపీ, టీవీకే పొత్తు కుదరదు!

**రెండు పార్టీల సిద్ధాంతాలు వేర్వేరు**

**తమిళనాడు బీజేపీ నేత అన్నామలై వెల్లడి**

చెన్నై: ప్రముఖ సినీ నటుడు, టీవీకే అధినేత విజయ్ ఎన్డీయేలో చేరతారనే ప్రచారంపై తమిళనాడు బీజేపీ నాయకుడు అన్నామలై స్పందించారు. బీజేపీ, టీవీకే పార్టీలు టీ, కాఫీ వంటివని, అవి ఎప్పటికీ కలవవని స్పష్టం చేశారు. రెండు పార్టీల సిద్ధాంతాలు పూర్తిగా వేరని అన్నారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ కూడా బీజేపీతో టీవీకే కలుస్తుందనే వార్తలను ఖండించారని వెల్లడించారు. తాము ఎవరితోనూ చర్చలు జరపలేదని వెల్లడించారు. తమిళనాడులో ఎన్డీయే అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. టీవీకే పార్టీ కూడా ఒంటరిగా పోటీ చేస్తానని చెబుతున్నట్లు తాను విన్నానని అన్నారు. తాము కూడా వారితో కలవడానికి ఆసక్తిగా లేమని స్పష్టం చేశారు. అలాంటప్పుడు ఇక్కడ పొత్తుల గురించి చర్చ ఎక్కడిదని ప్రశ్నించారు. తమిళనాడు ప్రజలు ఏ పార్టీని అధికారంలోకి తీసుకురావాలో ఆలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆలోచనలు ఎన్డీయే వైపు ఉన్నాయని తాను భావిస్తున్నట్లు చెప్పారు. ఎవరితో వెళ్లాలో టీవీకే ఇష్టమని, కానీ కొన్ని రాజకీయ పార్టీలు ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించేందుకు టీవీకే, బీజేపీ కలిసి వెళతాయని ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. విజయ్ సీబీఐ విచారణకు ఎన్నికలకు సంబంధం లేదని అన్నారు.

## వయ్యారి చిత్రం






## కెరీర్‌లోనే బిగ్ డీల్

నాగచైతన్య ఈసారి నెవ్వర్ బిఫోర్ అనే కంటెంట్ తో రాబోతున్న విషయం తెలిసిందే. లవ్ స్టోరీ, తండేల్ సినిమాలతో బిగ్ హిట్స్ అందుకున్న ఈ అక్కినేని హీరో ఈసారి కంప్లీట్ గా జోనర్ మార్చాడు. కార్తీక్ దండు దర్శకత్వంలో వృషకర్మ సినిమా రోజురోజుకు మంచి హైప్ క్రియేట్ చేసుకుంటోంది. ఇప్పటివరకు వచ్చిన కంటెంట్ అన్ని వర్గాల ఆడియెన్స్ ను ఎట్రాక్ట్ చేసింది. దర్శకుడు కార్తీక్ తన మొదటి సినిమా విరుపాక్షతో ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేసాడో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు అంతకుమించి నాగచైతన్యతో ఒక డిఫరెంట్ థ్రిల్లర్ ను చూపించబోతున్నాడు. ఇక ఈ సినిమాకు సంబంధించి రైట్స్ కోసం ప్రముఖ డిస్ట్రిబ్యూటర్స్ పోటీ పడ్డారు. ఇప్పటికే నాన్ థియేట్రికల్ గా మంచి డీల్స్ సెట్టయినట్లు తెలుస్తోంది. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కర్ణాటక థియేట్రికల్ హక్కుల కోసం కూడా భారీ ఆఫర్లు వచ్చాయి. అయితే ఆ మూడు రాష్ట్రాల హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ దక్కించుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ. 45 కోట్లకు దక్కించుకున్నట్లు అంచనా. మరో హైలెట్ ఏమిటంటే నాగచైతన్య కెరీర్‌లోనే ఇది అత్యధిక ప్రీ రిలీజ్ బిజినెస్ అని తెలుస్తోంది.



## నా నోరు నా ఇష్టం

ఐకానిక్ డైలాగ్‌లు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లు, మీమ్స్ సంస్కృతి.. ఇవన్నీ కలిసి ఇప్పుడు సెలబ్రిటీల చుట్టూ కొత్త చర్చలకు దారి తీస్తున్నాయి. తాజాగా నటిగా, నిర్మాతగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మంచు లక్ష్మి మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'లేచింది మహిళా లోకం' సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రత్యేకంగా సినిమాలో వినిపించే ఫ్లవర్– ఫైర్ తరహా డైలాగ్ కారణంగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున పోలికలు మొదలయ్యాయి. చాలా మంది నెటిజన్లు ఆ డైలాగ్‌ను పుష్ప మూవీలో అల్లు అర్జున్ చెప్పిన డైలాగ్ తో కంపేర్ చేస్తూ మీమ్స్ క్రియేట్ చేస్తున్నారు. ఒకప్పుడు సోషల్ మీడియాను ఊపేసిన ఆ డైలాగ్‌కు ఇప్పుడు కొత్త వర్షన్ వచ్చిందన్నట్లుగా మీమ్ పేజీలు ట్రెండ్ చేస్తుండటం గమనార్హం. కాగా తాజాగా ఈ కంపేరిజన్స్ పై మంచు లక్ష్మి స్పందించారు. ఆ డైలాగ్ ను కాపీ వివాదంగా చూడాల్సిన అవసరం లేదని.. పుష్ప2 సినిమా కంటే చాలా ముందే తమ సినిమా షూటింగ్ పూర్తైందని, ఆ డైలాగ్ కూడా అప్పుడే చెప్పిందని ఆమె క్లారిటీ ఇచ్చారు. సోషల్ మీడియాలో జరుగుతున్న పోలికలు కేవలం యాదృచ్ఛికమేనని చెప్పారు లక్ష్మి.

## అడివి శేష్ మాస్ స్ట్రాటజీ

టాలీవుడ్ ఇండస్ట్రీలో డిఫరెంట్ కంటెంట్ తో ఆడియెన్స్ కు థ్రిల్ ఇచ్చే అతికొద్ది మంది యువ హీరోలలో అడివి శేష్ ఒకరు. ఎలాంటి సినిమా చేసినా అందులో తన మార్క్ ట్విస్టులు ఉండేలా ఉండేలా చూసుకుంటాడు. ఇక నెక్ట్ కూడా అలాంటి ప్రయోగంతోనే రానున్నాడు. షానియల్ డియో దర్శకత్వంలో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న డెకాయిట్ చిత్రంపై అంచనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. లేటెస్ట్ గా విడుదలైన పోస్టర్ చూస్తుంటే ఈ సినిమాలో కేవలం ప్రేమ మాత్రమే కాదు, అంతకుమించిన మాస్ యాక్షన్ కంటెంట్ ఉండబోతోందని స్పష్టమవుతోంది. ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో, సినిమాలోని ఇంటెన్సిటీని ఈ పోస్టర్ హైలెట్ చేస్తోంది. ఈ కొత్త పోస్టర్ లో అడివి శేష్ లుక్ గమనిస్తే, అతని పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో అర్థమవుతుంది. చేతులకు బేడీలు ఉన్నప్పటికీ, ఎంతో ధీమాగా కూర్చుని సిగరెట్ వెలిగిస్తున్న ఆయన స్టైల్ మాస్ ఆడియన్స్‌కు ఫుల్ కిక్ ఇస్తోంది. తెల్లటి దుస్తులపై రక్తపు మరకలు, వెనుక నుంచి గన్ పట్టుకున్న పోలీస్ అధికారి.. ఈ విజువల్స్ అన్నీ సినిమాలో హీరో హీరోయిజం ఏ స్థాయిలో ఉండబోతోందో హింట్ ఇస్తున్నాయి. ఒక ప్రేమ కథ అనే క్లాస్ ట్యాగ్‌లైన్ ఉన్నప్పటికీ, టీజర్ నుండి ఇప్పటివరకు వచ్చిన ప్రతి పోస్టర్ లోనూ శేష్ మాస్ కంటెంట్, హీరోయిజంనే ఎక్కువగా హైలెట్ చేస్తున్నారు.





## మిరాయ్ పాప డ్రీమ్ స్కెచ్ అదిరింది!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై కర్చీఫ్ వేసేస్తోంది మిరాయ్ పాప రితికా నాయక్. ఢిల్లీలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కాలేజ్ ఫర్ ఉమెన్ లో హయ్యర్ ఎడ్యుకేషన్ పూర్తి చేసి ఢిల్లీ టైమ్స్ ఫ్రెష్ ఫేస్ 12 సీజన్ విజేతగా నిలిచిన ఈ బ్యూటీ.. ఆ తరువాత సినిమాల్లో అరంగేట్రానికి చాలా ప్రొడక్షన్ కంపనీల చుట్టూ తిరిగి ఆడిషన్‌లలో పాల్గొంది. ఫైనల్‌గా 2022లో మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ హీరోగా నటించిన అశోకవనంలో అర్జున కల్యాణంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చేసింది. ఫస్ట్ మూవీతో బెస్ట్ ఫిమేల్ డెబ్యూట్ అవార్డుని దక్కించుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. తేజ సజ్జ మిరాయ్‌లో కొంచెం బొద్దుగా మారి విభ క్యారెక్టర్‌లో హీరోకు కర్తవ్యబోధ చేసి తన లక్ష్యాన్ని గుర్తు చేసే క్యారెక్టర్‌లో కనిపించి ఆకట్టుకుంది. ప్రస్తుతం ఆనంద్ దేవరకొండ హీరోగా మిథున్ వరదరాజ కృష్ణనన్ రూపొందిస్తున్న ద్విభాషా చిత్రం డ్యుయెట్‌తో పాటు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటిస్తున్న హారర్ థ్రిల్లర్ కొరియన్ కనకరాజులో నటిస్తోంది. ఇందులో కొరియన్ కనకరాజు ఈ సమ్మర్‌కు రిలీజ్‌కు రెడీ అవుతోంది. రెండు క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తున్న రితికా నాయక్‌కు ఓ డ్రీమ్ ఉందట. అదేంటంటే ఎప్పటికైనా ఐకాన్ స్టార్ సినిమాలో నటించాలన్నదే తన డ్రీమ్ అంట. అల్లు అర్జున్ సినిమాలో చిన్న రోల్ అయినా సరే నటించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని చెబుతోంది.

## లావణ్య త్రిపాఠికి వేధింపులు



సోషల్ మీడియా వేధింపులు సామాన్యులకే కాదు, సెలబ్రిటీలకు కూడా తప్పడం లేదు. తాజాగా మెగా కోడలు, హీరోయిన్ లావణ్య త్రిపాఠి కూడా అలాంటి అనుభవాన్ని ఎదుర్కొన్నారు. తనపై, తన కుటుంబ సభ్యులపై నెట్టింట అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ పరువు నష్టం కలిగించే పోస్టులు పెడుతున్నారని ఆరోపిస్తూ ఆమె హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పర్పుల్ క్రెయాన్ 00 అనే ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా తనను టార్గెట్ చేసుకుని తప్పుడు మాటలు అంటున్నారని లావణ్య త్రిపాఠి తెలిపారు. కొంతకాలంగా ఆ అకౌంట్ నుంచి తన పర్సనల్ లైఫ్, కుటుంబ సభ్యుల గురించి తప్పుడు ప్రచారం చేస్తూ అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆమె వివరించారు. కామెంట్ల రూపంలో అసభ్య పదజాలంతో తిడుతున్నారని అన్నారు. ఆ వేధింపుల వల్ల తన పరువు ప్రతిష్టలకు భంగం కలుగుతోందని, చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు.

## కాలరే ఎత్తరా.. 'ఉస్తాద్' ఫ్యాన్స్ ఖుషీ!

టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కల్యాణ్ లీడ్ రోల్ లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ ప్రమోషన్స్ ఫుల్ జోష్ లో జరుగుతున్నాయి. విడుదల తేదీ దగ్గర పడుతున్న వేళ.. వరుస అప్డేట్స్ ఇస్తున్నారు మేకర్స్. తాజాగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న థర్డ్ సింగిల్ కాలరే ఎత్తరా కు సంబంధించిన ప్రోమో విడుదల చేశారు. పవన్ ఎనర్జీ, దేవిశ్రీ ప్రసాద్ ఇచ్చిన పవర్ ఫుల్ బీట్, మాస్ స్టెప్స్ తో ఆ ప్రోమో అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. పూర్తి లిరికల్ సాంగ్ ను మార్చి 12 సాయంత్రం 5 గంటలకు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. డాషింగ్ డైరెక్టర్ హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఆ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పవన్ కల్యాణ్ అభిమానులను దృష్టిలో పెట్టుకుని దర్శకుడు ప్రత్యేకంగా మాస్ ఎలిమెంట్స్ ను యాడ్ చేసినట్లు తాజాగా విడుదలైన సాంగ్ ప్రోమో చూస్తే స్పష్టంగా తెలుస్తోంది.

## నెలకు కోటి రెవెన్యూ

టాలీవుడ్ జేజమ్మగా, లేడీ సూపర్ స్టార్‌గా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న అనుష్క శెట్టి గత రెండు దశాబ్దాలుగా వెండితెరపై తిరుగులేని కథానాయికగా రాణిస్తోంది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన సూపర్ సినిమాతో సినీ రంగప్రవేశం చేసిన ఈ యోగా శిక్షకురాలు అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోల సరసన అవకాశాలు దక్కించుకుంది. తాజా సమాచారం ప్రకారం.. అనుష్క శెట్టి నికర ఆస్తి విలువ సుమారు 133 కోట్ల రూపాయల వరకు ఉంటుందని ప్రముఖ జాతీయ మీడియా తన కథనంలో పేర్కొంది. సినిమాలు తగ్గించినా కానీ.. నెలకు దాదాపు ఒక కోటి రూపాయల వరకు ఆదాయం గడిస్తూ స్వీటీ తన ఆర్థిక సామ్రాజ్యాన్ని పటిష్టంగా ఉంచుకుంది. అనుష్క కెరీర్ ప్రారంభంలో సాధారణ పారితోషికమే తీసుకున్నా కానీ..అరుంధతి సినిమా తర్వాత రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది.







## టీమిండియాకు బీసీసీఐ

# 131 క్యాష్ ప్రైజ్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో విజేతగా నిలిచిన భారత జట్టుపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) కనక వర్షం కురిపించింది. ఏకంగా రూ. 131 కోట్ల భారీ క్యాష్ ప్రైజ్ ప్రకటించింది. భారత క్రీడా చరిత్రలోనే అత్యధిక రివార్డ్ ఇది. గతంలో కంటే రూ.6 కోట్లు ఎక్కువగా నజరానా ప్రకటించింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024లో విజేతగా నిలిచిన రోహిత్ సేనకు బీసీసీఐ రూ. 125 కోట్ల క్యాష్ ప్రైజ్ అందజేసింది. అప్పుడు జట్టు మెంబర్స్ తలో రూ.5 కోట్లు తీసుకోగా.. రిజర్వ్ ప్లేయర్లకు రూ. 1 కోటి చొప్పున క్యాష్ ప్రైజ్ దక్కింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్‌ను 96 పరుగులతో చిత్తు చేసిన టీమిండియా వరుసగా రెండో టైటిల్ గెలవడంతో పాటు మూడో ట్రోఫీని ఖాతాలో వేసుకుంది. అంతేకాకుండా సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. దాంతో సూర్యసేనకు బీసీసీఐ రూ. 131 కోట్ల భారీ రివార్డ్ ప్రకటించింది. ఈ మేరకు బీసీసీఐ మంగళవారం ఓ ప్రకటనను విడదలు చేసింది. 'ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026లో సాధించిన ఘనవిజయానికి గుర్తుగా.. భారత క్రికెట్ జట్టుకు బీసీసీఐ రూ. 131 కోట్ల రూపాయల నగదు బహుమతిని ప్రకటించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఓడించిన భారత్ ప్రతిష్టాత్మక ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ విజయంతో టీమిండి తన టైటిల్‌ను నిలబెట్టుకోవడంతో పాటు ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ నెగ్గిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. అంతేకాకుండా, మూడుసార్లు టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకున్న తొలి జట్టుగా కూడా అవతరించింది. ఈ ఫార్మాట్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్టుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఈ చారిత్రాత్మక విజయం నేపథ్యంలో ఆటగాళ్లను, సహాయక సిబ్బందిని, సెలెక్టర్లను బోర్డు మరోసారి అభినందిస్తూ.. భవిష్యత్తులో కూడా వారు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించింది.'అని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఈ ప్రకటనలో పేర్కొన్నారు. రూ. 131 కోట్ల భారీ క్యాష్ రివార్డ్‌లో ఎవరికి ఎంత? అనే వివరాలను బీసీసీఐ వెల్లడించలేదు. జట్టులోని 15 మంది సభ్యులకు రూ. 5 కోట్ల నుంచి రూ. 6 కోట్ల చొప్పున లభించే అవకాశం ఉంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లకు కూడా ప్లేయర్లతో సమంగా క్యాష్ ప్రైజ్ ఇవ్వనున్నారు. ఫిజియోలు, ట్రైనర్లు, మసాజర్లు, ఇతర సహాయక సిబ్బందికి వారి హోదాను బట్టి రూ. 1 కోటి నుంచి రూ. 2 కోట్ల వరకు లభించవచ్చు. జట్టును ఎంపిక చేసిన సెలెక్షన్ కమిటీ సభ్యులకు కూడా కోటి చొప్పున నగదు పురస్కారం దక్కవచ్చు.



## అర్ష్‌దీప్‌కు మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత

టీమిండియా స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై ఐసీసీ కఠిన చర్యలు తీసుకుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిచెల్‌ను బంతి కొట్టిన ఘటనను తీవ్రంగా పరిగణించిన ఐసీసీ భారీ జరిమానా విధించింది. మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించడంతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ కేటాయించింది. ఈ మేరకు ఐసీసీ మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేసింది. 'ఆదివారం అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 ప్రపంచ కప్ 2026 ఫైనల్లో ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవల్ 1ను అర్ష్‌దీప్ సింగ్ ఉల్లంఘించాడు. దాంతో అతని మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించాం. అంతేకాకుండా ఆటగాడిపై ప్రమాదకరమైన రీతిలో బంతి విసిరి ఐసీసీ నియమావళిలోని ఆర్టికల్ 2.9ని ఉల్లంఘించాడు. దాంతో అర్ష్‌దీప్ సింగ్‌కు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించాం. గత 24 నెలల కాలంలో అతను ఇలాంటి తప్పు చేయడం ఇదే తొలిసారి. న్యూజిలాండ్ బ్యాటింగ్ సందర్భంగా 11వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. అర్ష్‌దీప్ తన ఫాలో-త్రూలో బంతిని అందుకొని డారిల్ మిచెల్‌పై విసిరాడు. ఆ బంతి మిచెల్ ప్యాడ్స్‌కు తగిలింది. మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ముందు తన తప్పిదాన్ని అంగీకరించిన అర్ష్‌దీప్ సింగ్.. శిక్షకు అంగీకరించాడు. దాంతో అధికారిక విచారణ లేకుండా చర్యలు తీసుకోవడం జరిగింది. ఫీల్డ్ అంపైర్ రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్, థర్డ్ అంపైర్ అల్లావుద్దీన్ పాలేకర్, ఫోర్త్ అంపైర్ అడ్రియన్ హోల్డ్‌స్టాక్ ఫిర్యాదుతో మ్యాచ్ రిఫరీ విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు. లెవల్ 1 ఉల్లంఘనలకు కనీస శిక్షగా అధికారిక మందలింపు, గరిష్ట శిక్షగా ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు విధిస్తారు.'అని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది.



# మరో 18 రోజులే..!

### ఐపీఎల్‌కు రంగం సిద్ధం

### 12న లేదా 13న షెడ్యూల్ విడుదల

పొట్టి ప్రపంచకప్ ముగియడంతో ఐపీఎల్ పండుగ కోసం క్రీడాభిమానులు ఎదురు చూస్తున్నారు. మార్చి 28 నుంచి మొదలయ్యే పంతొమ్మిదో సీజన్ దశల వారీగా జరగనుంది. అయితే.. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలో షెడ్యూల్ విడుదలను బీసీసీఐ ఆలస్యం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా బిగ్ హింట్ ఇచ్చాడు. షెడ్యూల్‌పై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ వచ్చే రెండు మూడు రోజుల్లోనే తొలి దశ షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌కు మరో 18 రోజులే ఉంది. రెండు దశల్లో జరిగే ఈ మెగా టోర్నీ మార్చి 28 నుంచి ప్రారంభం కానుంది. దాంతో.. తొలి దశ షెడ్యూల్‌పై మంగళవారం బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా స్పష్టతనిచ్చాడు. మార్చి 12న లేదా 13వ తేదీన షెడ్యూల్ విడుదల కానుందని ఆయన చెప్పాడు. 'ఐపీఎల్ 19వ సీజన్ షెడ్యూల్‌ను ఒకటి రెండు రోజుల్లో విడుదల చేయాలని అనకుంటున్నాం' అని క్రిక్ బజ్‌తో సైకియా తెలిపాడు. 'ఐపీఎల్‌ను రెండు దశలుగా నిర్వహించాలనుకుంటున్నాం. త్వరలోనే తొలి దశ షెడ్యూల్ ప్రకటిస్తాం. మొదటి 20 రోజుల మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్ అందులో ఉంటుంది. మార్చి 12న లేదంటే 13వ తేదీన.. ఈ రెండు తేదీల్లో కచ్చితంగా షెడ్యూల్ విడుదల చేస్తాం. కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఎన్నికల సంఘం ఖరారు చేసిన తర్వాత రెండో దశ షెడ్యూల్‌ను ప్రకటిస్తాం' అని బీసీసీఐ సెక్రటరీ వెల్లడించాడు. త్వరలోనే తమిళనాడు, అస్సాం, బెంగాల్, కేరళమ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. దాంతో.. ఎన్నికల షెడ్యూల్ ఖరారయ్యాక ఐపీఎల్ షెడ్యూల్ విడులకు బీసీసీఐ సన్నాహకాలు చేస్తోంది. ఈ నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలోనే రెండు దశలుగా టోర్నీని నిర్వహించాలని బీసీసీఐ, ఐపీఎల్ పాలక మండలి నిర్ణయించాయి. మరో విషయం.. పశ్చిమాసియా దేశాల్లోని యుద్ధం ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధనం కొరత ఏర్పడుతోంది. ప్రస్తుతానికి అసెంబ్లీ ఎన్నికలు మినహా, మిగతావేవీ బీసీసీఐపై ప్రభావం చూపడం లేదని సైకియా అన్నాడు. పంతొమ్మిదో సీజన్‌ను మే 31వ తేదీలోపే ముగిస్తామని ఆయన పేర్కొన్నాడు.



# మోదీ స్టేడియంలో నిలువు దోపిడీ

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు వచ్చిన అభిమానులకు స్టేడియం లోపల అమ్మిన వస్తువుల ధరలు షాక్‌కు గురిచేశాయి. బయట మార్కెట్‌లో కేవలం రూ. 20కే లభించే సాధారణ లీటర్ మంచినీళ్ల బాటిల్‌ను స్టేడియంలోని వెండర్లు ఏకంగా రూ. 200 నుంచి రూ. 300 వరకు విక్రయించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఒక వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో ఒక అభిమాని మంచినీళ్ల బాటిల్ అడగగా, అక్కడి సిబ్బంది నిర్మొహమాటంగా రూ. 200 అని చెప్పడం ప్రేక్షకులను తీవ్ర నిరాశకు గురిచేసింది. మరోవైపు స్టేడియంలో తాగునీరు ఉచితంగా అందుబాటులో ఉంచామని యాజమాన్యం చెబుతున్నప్పటికీ, ఎక్కడా నీటి సౌకర్యం కనిపించడం లేదని అభిమానులు ఆరోపించారు. ఫైనల్ మ్యాచ్ కావడంతో స్టేడియం కిక్కిరిసిపోవడం, భద్రతా కారణాల దృష్ట్యా బయటి నుంచి నీళ్ల బాటిళ్లను అనుమతించకపోవడాన్ని ఆసరాగా చేసుకుని విక్రేతలు అడ్డగోలుగా ధరలు పెంచేసినట్లు బాధితులు వాపోతున్నారు. కేవలం నీళ్లే కాకుండా, స్నాక్స్ మరియు కూల్ డ్రింక్స్ ధరలు కూడా సాధారణం కంటే మూడు నుంచి నాలుగు రెట్లు ఎక్కువగా ఉండటంపై నెటిజన్లు మండిపడుతున్నారు. వేల రూపాయలు వెచ్చించి టికెట్లు కొని, భారీ ఖర్చుతో హోటళ్లు బుక్ చేసుకుని వచ్చిన తమకు కనీసం మంచినీటిని కూడా సరసమైన ధరలకు అందించకపోవడంపై క్రికెట్ ప్రేమికులు మేనేజ్‌మెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## సెలబ్రేషన్సా.. కిస్సుల పోటీలా..!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 విజయానంతరం ఆటగాళ్లు ప్రవర్తించిన తీరుపై సోషల్ మీడియా వేదికగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా తమ భాగస్వాములతో కలిసి ఆటగాళ్లు వ్యవహరించిన తీరు తీవ్ర చర్చనీయాంశమైంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో సమష్టిగా రాణించిన టీమిండియా 96 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. ఈ గెలుపుతో డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడంతో పాటు సొంతగడ్డపై ప్రపంచకప్ గెలిచిన టీమ్‌గా సరికొత్త చరిత్ర సృష్టించింది. టీమిండియాకు ఇది మూడో టీ20 ప్రపంచకప్ కావడం విశేషం. ఈ విజయానంతరం భారత ఆటగాళ్ల కుటుంబ సభ్యులు, భాగస్వాములు మైదానంలోకి అనుమతించారు. ఆటగాళ్లంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ విజయాన్ని ఆస్వాదించారు. మరోవైపు రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ ఆటగాళ్లు కూడా తమ సతీమణులు, కుటుంబ సభ్యులతో మైదానంలోకి వచ్చారు.





## కివీస్ వ్యూహాత్మక తప్పిదాలు: సబా కరీం


ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో న్యూజిలాండ్ స్వయంకృతపరాధంతో విజేతగా నిలవలేకపోయిందని టీమిండియా మాజీ వికెట్ కీపర్ సబా కరీం అన్నాడు. వ్యూహాత్మక తప్పిదాలతో ఐసీసీ టైటిల్ గెలిచే అవకాశాన్ని చేజార్చుకుందని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ చేసిన మూడు తప్పిదాలు ఆ జట్టు ఓటమిని శాసించాయని తెలిపాడు. 'సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో న్యూజిలాండ్ ప్రదర్శించిన వ్యూహాత్మక చాతుర్యం ఫైనల్లో కనిపించలేదు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడమే న్యూజిలాండ్ చేసిన మొదటి తప్పు. ఈ ప్రపంచకప్‌లో భారత్ ఒకే ఒక్క మ్యాచ్‌లో ఓడింది. అది కూడా అహ్మదాబాద్ వేదికగానే సౌతాఫ్రికాతో ఛేజింగ్‌లో తెలిపోయింది. అది తెలిసి కూడా న్యూజిలాండ్ బౌలింగ్ ఎంచుకొని తప్పిదం చేసింది. న్యూజిలాండ్ ముందుగా బ్యాటింగ్ చేయాల్సింది. కానీ వారు మంచి అవకాశాన్ని చేజార్చుకున్నారు. రైట్ ఆర్మ్ ఆఫ్ బ్రేక్ బౌలర్ అయిన కోల్ మెక్కాన్చీని తుది జట్టు నుంచి తప్పించడం న్యూజిలాండ్ చేసిన రెండో తప్పిదం. సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో మెక్కాన్చీని అద్భుత బౌలింగ్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. గ్లేన్ ఫిలిప్స్‌ను రెండో ఓవర్‌లో బౌలింగ్ చేయించడం న్యూజిలాండ్ చేసిన తప్పిదం. ఆ ఓవర్‌లో అతను ఐదు పరుగులే ఇచ్చినా.. మళ్లీ బౌలింగ్ ఇవ్వలేదు. కెప్టెన్‌గా మిచెల్ సాంట్నర్ మైదానంలో చేసిన మూడు అతి పెద్ద వ్యూహాత్మక తప్పిదాలు ఇవే. అతను ఇలా చేయడం వింతగా అనిపించింది. ఎందుకంటే ఈ టోర్నీలో అతను కెప్టెన్‌గా అతని వ్యూహాలు అద్భుతంగా ఉన్నాయి. న్యూజిలాండ్ పొరపాట్లు చేయకూడదని అనిపించిన తొలి మ్యాచ్ కూడా ఇదే. ఈ తప్పిదాలను టీమిండియా క్యాష్ చేసుకుంది. వాస్తవానికి న్యూజిలాండ్ కంటే టీమిండియానే బలంగా ఉంది. హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగింది. ఇలాంటి మ్యాచ్‌ల్లో సరైన నిర్ణయాలు తీసుకోవాలి. కానీ న్యూజిలాండ్ విచిత్రమైన నిర్ణయాలతో బంగారం లాంటి అవకాశాన్ని చేజార్చుకుంది.'అని సబా కరీం పేర్కొన్నాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# జనం మారిపోయారు..!

'జనం మారారు.. అందుకే మేము జనంలోకి వచ్చాం' – ఇవి ఒకప్పుడు అడవిని నమ్ముకుని, తుపాకీతో విప్లవం వస్తుందని భావించిన మావోయిస్టు అగ్రనేతలు ఇప్పుడు వినిపిస్తున్న మాటలు. దశాబ్దాల సాయుధ పోరాటం తర్వాత, మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా మావోయిస్టు ఉద్యమం ఒక చారిత్రక మలుపు వద్ద నిలిచింది. ఒకప్పుడు అడవిలో ఉండి పోరాడితేనే హక్కులు వస్తాయని భావించిన ప్రజలు, ఇప్పుడు అభివృద్ధిని, ప్రజాస్వామ్య ఫలాలను ఆశిస్తున్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న మౌలిక సదుపాయాలు, విద్య, ఉపాధి అవకాశాల పట్ల మారుమూల గ్రామాల్లోనూ ఆసక్తి పెరిగింది. తుపాకీ గొట్టం ద్వారా వచ్చే మార్పు కంటే, ఓటు హక్కు ద్వారా, రాజ్యాంగబద్ధమైన పోరాటాల ద్వారా వచ్చే మార్పే శాశ్వతమని జనం గుర్తించారు. ఈ మార్పును గమనించిన మావోయిస్టు శ్రేణులు, అజ్ఞాతవాసం వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు మొగ్గు చూపుతున్నాయి. ఇటీవల తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో మావోయిస్టు అగ్రనేతల లొంగుబాట్లు, రాజకీయాల్లోకి వస్తామన్న వారి ప్రకటనలు ఉద్యమంలో వస్తున్న అంతర్గత మథనానికి నిదర్శనం. ప్రజల నుంచి మద్దతు తగ్గుతుండటం, యువత విప్లవ భావజాలం కంటే ఉపాధికి ప్రాధాన్యతనివ్వడం వంటి కారణాలు వారిని ఆత్మపరిశీలనలో పడేశాయి. తుపాకీని వదిలి, ప్రజాక్షేత్రంలో ఉండి సమస్యలపై పోరాడాలని వారు నిర్ణయించుకోవడం ఒక సానుకూల పరిణామం. కేంద్ర ప్రభుత్వం ఈ నెల చివరి నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో, పెద్ద సంఖ్యలో కేడర్ లొంగిపోవడానికి సిద్ధంగా ఉండటం ఆహ్వానించదగ్గ విషయం. అయితే, లొంగిపోయిన వారికి సరైన పునరావాసం కల్పించడం, వారిపై ఉన్న కేసుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించడం ప్రభుత్వాల బాధ్యత. అప్పుడే వారు పూర్తిస్థాయిలో సమాజంలో కలిసిపోయి, అభివృద్ధిలో భాగస్వాములు కాగలరు. హింస లేని సమాజమే ఏ విప్లవానికైనా అంతిమ లక్ష్యం కావాలి. జనం మారినప్పుడు, వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమాలు కూడా తమ పంథాను మార్చుకోవడం అనివార్యం. మావోయిస్టులు ఆయుధాలు వీడి జనంలోకి రావడం అంటే అది ఓటమి కాదు, ప్రజాస్వామ్యం మీద నమ్మకంతో కొత్త ప్రయాణం ప్రారంభించడం. ఈ మార్పు రక్తపాతానికి స్వస్తి పలికి, శాంతియుత అభివృద్ధికి బాటలు వేస్తుందని ఆశిద్దాం.



## గురుకుల జ్ఞాన యోధులం

ఇదే ఇదే మా గురుకులం
మా కళలను నిజం చేసే జ్ఞాన నిలయం
సమసమాజ స్థాపనకై
మహాత్మ జ్యోతిబాపూలే పేరుతో..
నడుస్తున్న గురుకులం!!

వెనుకబడిన పిల్లలను వెలుగు..
దివ్వెలుగా మార్చే జ్ఞాన ఆలయం
తల్లిగా లాలించి, తండ్రిలా పాలించి
కష్ట సుఖాలలో తోడుండే..
నేస్తంలా ఉండే గురువులు
ఉత్తమ గురువులతో..
అనునిత్యం జ్ఞానం పొందే పిల్లలం

దేశ భవిత రక్షణకై గురుకులంలో..
తయారు అవుతున్న రేపటి పౌరులం
మేమే గురుకుల పిల్లలం
కాబోయే భావి భారత పౌరులం!!



కడాల భార్గవ్
7వ తరగతి
మహాత్మా జ్యోతిబాపూలే
గురుకుల పాఠశాల,
చిన్నకంజర్ల, పఠాన్ చెరు, హైదరాబాద్

# అసైన్డ్ భూమి కొంటున్నారా?

స్థిరాస్తి కొంటున్నప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలసి వస్తుంది. ముఖ్యంగా వ్యవసాయ భూమిని కొంటున్నప్పుడు ఇంకా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా భూమి కొనుగోలు చేస్తున్నప్పుడు అట్టి భూమి స్వభావము ఎలాంటిదో తెలుసుకోవాలి. సరైన అవగాహన లేకుండా ఖరీదు చేసినచో పెట్టుబడి పెట్టిన మొత్తము వృధా అవుతుంది. తరువాత ఎంత నెత్తి నోరు బాదుకున్నా ఎన్ని కోర్టుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం అవుతుంది.

భూములు ఎన్నో రకాలుగా ఉంటాయి. అందులో సాధారణ పట్టా భూములు, ప్రభుత్వ భూములు, ఇనామ్ భూములు, అసైన్డ్ భూములు, గ్రామ కంఠం భూములు, మొదలగునవి. పట్టా భూములు తప్ప మిగతా ఎలాంటి భూములు కూడా కొనకూడదు. ఇందులో అసైన్డ్ భూముల గురించి తెలుసుకుందాం.



అసైన్డ్ భూములను డీ-ఫామ్ భూములు, డి. కె. టి. భూములు, లావని పట్టా భూములు అని కూడా పిలుస్తారు. అసైన్డ్ భూమి అంటే, ప్రభుత్వము భూమి లేని నిరుపేదలకు జీవనోపాధి కోసం ఉచితంగా కేటాయించిన భూమి. దీనిని అమ్మడం లేదా బదిలీ చేయడం చట్ట రీత్యా నిషిద్ధం. కేవలం సాగు చేసుకోవడానికి మాత్రమే అనుమతి ఉంటుంది. దీని ప్రధాన ఉద్దేశ్యం ఏమిటనగా ముఖ్యంగా ఎలాంటి జీవనోపాధి లేని పల్లెటూరి నిరుద్యోగ నిరుపేదలకు నిరుపయోగంగా ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని సాగు చేసుకోవటానికి అవకాశం కల్పిస్తూ వ్యవసాయం ద్వారా జీవనోపాధిని పొందుతూ వారి జీవనోపాధితో పాటుగా ప్రభుత్వానికి తగిన శిస్తును చెల్లించడం ద్వారా అటు పేదవానికి జీవనోపాధి, ఇటు ప్రభుత్వానికి రెవెన్యూ వస్తుంది అనే సదుద్దేశ్యంతో ఏర్పాటు చేయబడినటువంటి ఒక ప్రభుత్వ ప్రణాళిక. అసైన్డ్ భూములు అమ్మడానికి వీలు లేదు. అసైన్డ్ భూములను ఇతరులకు అమ్మటం, బదిలీ చేయటం లేదా లీస్ కొరకు ఇవ్వడం వంటివి చేయకూడదు. అలా చేసినచో, చేసిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం సంబంధిత అధికారులకు ఉంటుంది. అసైన్డ్ భూములను ఇతరులకు అమ్మినచో లేదా బదిలీ చేసినచో, పి. ఓ. టి. క్రింద ప్రభుత్వమే నేరుగా స్వాధీనము చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంటుంది. అసైన్డ్ భూములను ఆంధ్ర ప్రదేశ్ లో డి. కె. టి. భూములు లేదా దరఖాస్తు భూములు అంటారు. తెలంగాణ ప్రాంతంలో అసైన్డ్ భూములను లావని పట్టా భూములు అంటారు. రెండూ ఒకటే. రెండూ ఒకే స్వభావాన్ని కలిగి ఉంటాయి. రెండూ కూడా ప్రభుత్వ భూములే. వీటిని 9/77 చట్టం ద్వారా ప్రభుత్వము పర్యవేక్షిస్తుంది. ఆంధ్ర ప్రదేశ్ అసైన్డ్ భూములు (బదిలీ నిషేధం) చట్టం, 1977 మరియు తెలంగాణ అసైన్డ్ భూములు (బదిలీ నిషేధం) చట్టం, 1977 అనునవి దీనికి సంబంధించిన చట్టాలు. వీటి ద్వారానే ప్రభుత్వం అసైన్డ్ భూములను నియంత్రిస్తుంది.

1977 సంవత్సరం నుండి 2007 వరకు అయితే ఆంధ్ర ప్రదేశ్ లో, 1977 సంవత్సరం నుండి 2014 వరకు అయితే తెలంగాణలో ఈ మధ్య కాలంలో ఎవరైతే అసైన్డ్ భూములను కొంటారో అట్టి వారిని ఆ భూముల నుండి తొలగించవద్దు. వారికే అసైన్మెంట్ పట్టా ఇస్తారు. 1977 లో చట్టం రావడానికి ముందు కొన్న అసైన్మెంట్ భూములను అమ్ముకోవచ్చు. కానీ అట్టి అసైన్మెంట్ భూముల అమ్మకం మరియు కొనుగోలులో ఎన్నో నిబంధనలను పొందుపర్చినారు. అట్టి అసైన్మెంట్ భూములను అమ్మినపుడు కొనేవారు కూడా పేదవారై ఉండాలి. అట్లు పేదవారు కాకుండా ఉన్నత వర్గానికి చెందిన వారు ఎవరైనా కొంటే అలాంటి కొనుగోలు చెల్లదు. అట్లు కొనుగోలు చేసిన భూమిని ప్రభుత్వం ఎప్పుడైనా స్వాధీనం చేసుకోవచ్చు. పేదవారు అనడానికి కూడా తగిన అర్హతలను తెలియజేయడం జరిగినది. కావున ఎవరు ఉన్నవారు, ఎవరు పేదవారు అని చట్టపరంగా తెలుసుకోవడం సామాన్య ప్రజానీకానికి తెలుసుకోవడానికి అంత సులువైనది కాదు కాబట్టి ఇలాంటి భూములను కొనకపోవడమే అత్యుత్తమం. అసైన్మెంట్ భూములు కలిగి ఉన్నవారికి అట్టి భూములపైన బ్యాంకులు రుణాలను అందజేస్తాయి. ముఖ్యంగా వ్యవసాయ రుణాలను ఇస్తాయి. ఎవరైనా అసైన్డ్ భూములపైన రుణాలు తీసుకుని చెల్లించలేని పక్షంలో అలాంటి భూములు బ్యాంకులు వేలం వేస్తే, అట్టి వేలంలో కొన్న భూములపైన పూర్తి హక్కులు వస్తాయి. అలాంటి భూములను కొనవచ్చు మరియు అమ్మవచ్చు. కానీ ఇలాంటి కొనుగోళ్ల మరియు అమ్మకముల విషయంలో ఎన్నో నిబంధనలు వర్తిస్తాయి. పేదవారు కాకపోయినా ఈ క్రింది కొన్ని కేటగిరీల వారికి ప్రత్యేక కేటగిరీ క్రింద ప్రభుత్వం భూమి ఇస్తుంది. అలాంటి కేటగిరీల వారు కొన్ని నియమ నిబంధనల ప్రకారం వారికి కేటాయించిన భూములను అమ్ముకోవచ్చు. వారు ఎవరంటే..

1) రాజకీయ బాధితులు
2) మాజీ సైనికులు
3) స్వాతంత్ర్య సమర యోధులు, మొదలైనవారు.

- రాజకీయ బాధితులు ప్రభుత్వము భూమి ఇవ్వగానే వారికి అమ్ముకునే హక్కు కొన్ని నియమ నిబంధనల మేరకు ఉంటుంది.
- మాజీ సైనికులు మరియు స్వాతంత్ర్య సమర యోధులు మొదలైన వారికి, ప్రభుత్వము వారికి భూమి ఇచ్చిన రోజు నుండి కనీసం 10 సంవత్సరముల తర్వాత అట్టి భూములను నియమ నిబంధనల మేరకు అమ్ముకునే హక్కు ఉంటుంది.

కావున సరైన అవగాహన లేకుండా అసైన్మెంట్ భూములను కొనరాదు. కొని బాధ పడే బదులు వాటి జోలికి వెళ్లక పోవడమే ఉత్తమం.



ఏజే కరణ్‌లాల్, అడ్వొకేట్
94925 57496
advocateajkl@gmail.com

# గ్లామర్ వెనుక గలీజ్ పనులు



సినిమా రంగం అంటేనే రంగుల ప్రపంచం. వెండితెరపై కనిపించే మెరుపులు, ఆకర్షణలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయి. కానీ, అదే గ్లామర్ ప్రపంచం వెనుక ఉన్న చీకటి కోణాలు, ముఖ్యంగా సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నాయి. ఇటీవల కాలంలో చిత్ర పరిశ్రమలో చోటుచేసుకుంటున్న విడాకులు, విడిపోతున్న జంటల వెనుక మూడవ వ్యక్తి ప్రమేయం ఉందనే వార్తలు సామాజికంగా కలకలం రేపుతున్నాయి. భారతీయ సమాజంలో వివాహం అనేది ఒక పవిత్రమైన బంధం. అయితే, సినీ రంగంలో పెళ్లైన హీరోలు లేదా ఇతర ప్రముఖుల జీవితాల్లోకి హీరోయిన్లు ప్రవేశించడం వల్ల దశాబ్దాల కాలం నాటి కుటుంబాలు ముక్కలవుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. షూటింగుల పేరుతో నెలల తరబడి కలిసి గడపడం, ఆకర్షణలకు లోనుకావడం వల్ల పచ్చని సంసారాల్లో చిచ్చు రేగుతోంది. ఇది కేవలం ఆ ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన విషయం మాత్రమే కాదు, వారిపై ఆధారపడిన పిల్లల భవిష్యత్తును, మానసిక స్థితిని కూడా దెబ్బతీస్తోంది. ఒకప్పుడు విడాకులు అంటే సమాజంలో ఒక చిన్నచూపు ఉండేది. కానీ నేడు సెలబ్రిటీలు చాలా సులువుగా అభిప్రాయ భేదాల పేరుతో విడిపోతున్నారు. సోషల్ మీడియాలో పేర్లు మార్చుకోవడం, ఫోటోలు తొలగించడం ద్వారా విడాకుల సంకేతాలు ఇవ్వడం ఒక ట్రెండ్‌గా మారింది. దీనివల్ల సామాన్య ప్రజల్లో కూడా నచ్చకపోతే విడిపోవచ్చు అనే ధోరణి బలపడుతోంది. ఇది పరోక్షంగా మన సామాజిక విలువలను బలహీనపరుస్తోంది. సినిమా తారలు సమాజానికి రోల్ మోడల్స్‌గా ఉంటారు. వారిని అనుసరించే యువతపై వారి వ్యక్తిగత నిర్ణయాల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. గ్లామర్ ప్రపంచంలో ఆకర్షణలు సహజమే కావొచ్చు, కానీ బాధ్యతాయుతమైన పౌరులుగా కుటుంబ వ్యవస్థను గౌరవించాల్సిన అవసరం ఉంది. విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు కేవలం వ్యక్తిగత నష్టం మాత్రమే కాదు, అది ఒక ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఆటంకం. తారలు తమ వ్యక్తిగత జీవితాల్లో విజ్ఞతతో వ్యవహరించినప్పుడే వెండితెర వెలుగులకు నిజమైన గౌరవం దక్కుతుంది.



శశిధర్ అక్కెల

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.